స్వర్ణ మయూరం!

అజీజ్

"డిటెక్టివ్ దుర్యోధన్ గారు ఉన్నారా?" వీణా తంత్రులు మీటినట్టు వినిపించిన కమ్మని కంఠం విని, చటుక్కున తలెత్తి చూశాడు అర్జున్.

సుమారు పాతికేళ్ళుంటాయామెకి. గులాబిరంగు ఒళ్ళు. చారడేసి కళ్ళు. నిండుగా, పొందికగా యెదిగిన అవయవాలు. ఉంగరాలు తిరిగి ఏపుగా, ఒత్తుగా పెరిగిన శిరోజాలు. రోజారేకుల్ని మరిపించే పల్చని పెదాలు.

ఆకుపచ్చ రంగు పట్టుచీర, అదేరంగు బ్లౌజు ఆమె ఒంటి రంగును మరింత స్పష్టంజేస్తున్నాయి. కళ్ళల్లోనూ, నిల్చున్న తీరులోనూ గొప్పింటి అమ్మాయిలకుండే ఠీవీ, గాంభీర్యం వ్యక్తమౌతున్నాయి.

"ఉన్నారు. రండి. లోపలికి రండి" అన్నాడు అర్జున్ లేస్తూ.

ఆమె లోన అడుగుపెట్టి—"నా పేరు స్వప్నరాశి! దుర్యోధన్ గార్ని కలుసుకోవడానికి వచ్చాను" అంది.

"కూర్చోండి. లోపల ఉన్నారు. పిలుచుకొస్తాను" అన్నాడు అర్జున్, సోఫా చూపుతూ.

"నా వెంట ఫామిలీ లాయర్ కూడా ఉన్నారు. బైట టాక్సీవాడికి డబ్బిచ్చి వస్తున్నారు" అంది సోఫాలో చతికిలబడుతూ.

అంతలో కాంపౌండ్ గేటుగుండా ఫుల్ సూటులో ఉన్న ఓ వ్యక్తి కనిపించాడు. నలభై ఏళ్ళుంటాయతనికి. మామూలు ఒడ్డూపొడుగు.

రిస్టువాచీ చూసుకున్నాడు అర్జున్. ఉదయం పది గంటలు.

అతను గుమ్మంలోకి రాగానే, "వెల్‌కమ్ ప్లీజ్!" అన్నాడు అర్జున్.

అతను లోన అడుగుపెట్టి, "గ్లాడ్ టు మీట్ యూ మిస్టర్ దుర్యోధన్!" అన్నాడు చెయ్యి చాపుతూ.

అర్జున్ నవ్వి— "నేను దుర్యోధన్ని కాను. ఆయన అసిస్టెంట్ అర్జున్ని! కూర్చోండి. ఇప్పుడే వస్తాను" అంటూ లోనికి నడిచాడు.

ఐదు నిమిషాల తరవాత దుర్యోధన్‌తో డ్రాయింగ్ రూంలో అడుగుపెట్టాడు. దుర్యోధన్ని చూడగానే క్లయింట్స్ ఇద్దరూ లేచి నిల్చున్నారు.

స్వప్నరాశి ముందు తనని పరిచయం చేసుకుని, "ఈయన మా ఫామిలీ లాయర్ దివ్యనాథ్ గారు" అంది ఆ వ్యక్తిని చూపుతూ.

దుర్యోధన్ అతనికి షేక్‌హాండ్ ఇచ్చి సోఫాలు చూపి, తనూ కూర్చున్నాడు. అర్జున్ తన టేబిల్ మీది షార్టుహాండ్ బుక్, పెన్సిల్ అందుకుని, వాళ్ళు చెప్పేది నోట్ చేసుకోడానికి సిద్ధంగా కూర్చున్నాడు.

ఆ యువతి ప్రారంభించింది. "మీ సహాయంకోసం చాలా దూరంనించి, విజయనగరంనించి వచ్చాం! మీ ద్వారా మా సమస్య తప్పక పరిష్కారమౌతుందన్న నమ్మకంతో."

దుర్యోధన్ తలూపి, చెప్పండి!" అన్నాడు.

స్వప్నరాశి కంఠం సవరించుకుని చెప్పసాగింది. "ముందు ఎక్కణ్ణించి ప్రారంభించాలో అర్థంకావడం లేదు. మొదట మా వంశం గురించి వివరించడం మంచిది. మా నాన్న పేరు రఘుపతినాయుడు. స్వాతంత్ర్యానికి పూర్వం విజయనగరం చుట్టుపక్కల మాకు పెద్ద జాగీరు ఉండేది. ఇప్పుడంతా పోయిందనుకోండి.

"ప్రస్తుతం మా ఆర్థికపరిస్థితి అంతంత మాత్రమే! గడచిన పదిహేను సంవత్సరాలనించీ నాన్నగారు మా కట్టుసీ కాపాడటానికి ఇంట్లోని విలువైన నగలూ, వస్తువులూ ఒక్కొక్కటే అమ్ముతూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

"ఇది ఉపోద్ఘాతం! ఇక అసలు విషయానికి వస్తున్నాను. పాతికేళ్ళక్రితం మా నాన్నగారికి ఓ తమ్ముడుండేవారట. ఏదో విషయంలో వాళ్ళిద్దరికి పొసగక, స్వతహాగా ముక్కోపీ, ఆత్మాభిమానీ అయిన ఆయన ఇల్లువిడిచి ఎటో వెళ్ళిపోయారట. తరవాత ఎంత వెదికినా ఆయన జాడ తెలియలేదట.

"కానీ, ఇన్నేళ్ళ తరవాత కొద్దిరోజుల క్రితం అనుకోకుండా ఆయన వివరాలు తెలిశాయి మాకు. బొంబాయిలో ఒక అధికారిగా మా చిన్నాన్న ఈ మధ్యే మరణించినట్టు, ఆయన లాయర్ అక్కణ్ణించి మాకు టెలిగ్రాం ఇచ్చాడు.

"చిన్నాన్న మరణిస్తూ, తనయావదా స్తికీ నన్ను వారసురాలిగా నిర్ణయించి పోయారట. ఆయనకి నేనంటే పంచ ప్రాణాలట. విచిత్రం ఏమిటంటే ఇంతవరకూ నేనాయన్ని చూడనేలేదు! కారణం, ఆయన ఇల్లు విడిచినప్పుడు నేను పాలుగారే పసిదాన్ని!

"వట్టి చేతులతో ఇల్లు విడిచి వెళ్ళిన వ్యక్తి అదృష్ట దేవత కటాక్షంపొంది ఐశ్వర్యవంతు డయ్యాడు. ఆ డబ్బు ఆయన కష్టపడి సంపాదించి ఉండవచ్చు. లేదా అక్రమంగా సంపాదించి ఉండవచ్చు. అవన్నీ ఇప్పుడు అప్రస్తుతం!

"అదృష్టం వెనకే దురదృష్టంకూడా వెన్నంటి ఉంటుందనడానికి ఆయన జీవితమే ఓ తార్కాణం! డబ్బు సంపాదించాడు. పెళ్ళి చేసుకున్నాడు. అన్నీ ఇచ్చి భగవంతుడాయనకు సంతానభద్ర ప్రసాదించలేదు. అందుకే ఆ సిరి నన్ను వరించబోతోంది!"

"లక్షలకి అధికారి కాబోతున్న మీరు, ఇలా గాభరా పడుతూ అంత దూరంనించి ఇక్కడికెందుకు పరిగెత్తుకొచ్చారు?" అడిగాడు దుర్యోధన్ ఆశ్చర్యంగా.

ఆమె నిట్టూర్చి—"ఆ ఆస్తిని దక్కించుకోడానికి పెద్ద చిక్కు ఏర్పడింది మరి!" అంది.

"ఏమిటా చిక్కు?"

"చిన్నాన్న తన వీలునామాలో, తన ఆస్తికి ఎవరైతే వారసులుగా నిర్ణయించబడ్డారో, ఆ వ్యక్తి మా వంశ చిహ్నమైన ఒక వస్తువు కోర్టులో చూపించి, ఆ స్తి స్వాధీన పత్రాలు స్వీకరించాలని షరతు పెట్టారు."

"ఏమిటా వస్తువు?" అడిగాడు దుర్యోధన్ ఆసక్తిగా.

"స్వర్ణ మయూరం!"

"బంగారు నెమలా?" దుర్యోధన్ కనుబొమలు ముడి పడ్డాయి.

"ఔను. ఆ బంగారు నెమలికి ఒక చరిత్ర వుంది. మా వంశ అగ్రజుడు ఆనాటి విజయనగర సామ్రాజ్యంలో ఒక సామంతరాజువద్ద సైన్యాధికారిగా ఉండేవారట. ఒకనాడు ఆ రాజుమీదికి దండెత్తివచ్చిన ఓ శత్రు సైన్యాన్ని తన అసమాన పరాక్రమాలతో ఓడించి తరిమినందుకు ఆ రాజుగారు ఆయనకా స్వర్ణ మయూరాన్ని, పెద్ద జాగీరు నూ జ్ఞాపకార్థం కానుకగా ఇచ్చారట.

"ఆనాటినించీ అది మా వంశ చిహ్నంగా ఒకరి తరవాత ఒకరికి చెందుతూ వస్తోంది!"

"ఇంకేం, ఆ మయూరాన్ని కోర్టులో చూపి మీ చిహ్నాన్న ఆస్తి స్వాధీనం చేసుకోవచ్చు కదా?"

"చేసుకోవచ్చు. కానీ, చిక్కంతా అక్కడే వుంది. ఆరేళ్ళక్రితం మా నాన్న ఆ స్వర్ణమయూరాన్ని అమ్మే శారు."

"ఎవరికి?"

"చరిత్రాత్మక వస్తువులు అమ్మిపెట్టే ఓ బ్రోకర్ ద్వారా ఓ కోటీశ్వరుడికి. అతను అండమాన్, నికోబార్ దీవుల కేంద్రమైన పోర్టుబ్లెయర్ నివాసిట. అతని పేరు గరుడప్పన్! కేరళీయుడు.

"అతనికి చరిత్రాత్మక వస్తువులు సేకరించే పిచ్చి ఉంది. మా స్వర్గ మయూరం చరిత్ర తెలియగానే, కోరినంత డబ్బు గుమ్మరించి దాన్ని కొనుక్కున్నాడు."

"ఇందులో సమస్య ఏముంది? మళ్ళీ అతని దగ్గర

ఆ మయూరాన్ని మీరు కొనుక్కో వచ్చుకదా?"

"నో, నో! అదంత తేలికైన పనికాదు. ఆ వ్యక్తి ఒకసారి కొన్న వస్తువును మళ్ళీ అమ్మడం, తన ప్రతిష్టకి పెద్ద అరిష్టంగా భావిస్తాడుట. ఎట్టి పరిస్థితిలోనూ అతను దాన్ని ఎవ్వరికీ అమ్మడు.

"ఓహో, ఇప్పు డర్థమైంది. ఆ స్వర్ణ మయూరాన్ని ఎలాగైనాసరే మీకు తెచ్చిపెట్టాలనే మీరు నా దగ్గరికి వచ్చారన్నమాట!"

స్వప్నరాణి తలూపింది. "ఔను. మీరు కోరినంత ఫీజు చెల్లిస్తాను. ప్లీజ్, నాకు సహాయపడండి!"

"పోర్ట్ బ్లేయర్ లో నివసించే ఆ కోటీశ్వరుడు, యెట్టి పరిస్థితిలోనూ తను కొన్న వస్తువులు యెవరికీ అమ్మడు. అతనికి నచ్చజెప్పడానికి వ్యక్తిగతంగా అతనితో నాకెలాటి పరిచయమూ లేదు. మరి ఎలా సంపాదించాలి దాన్ని? దొంగిలించి తీసుకురమ్మంటారా?"

"ఎలా తీసుకురావాలో మీకు సలహా ఇచ్చేంతటి దాన్ని కాను. మీ మేధా సంపత్తిని ఉపయోగించి యెలాగైనా తీసుకురండి. లేకుంటే, నాకు రాబోయే ఆస్తంతా గంగపాలవుతుంది. ప్లీజ్!"

"సారీ! అయామ్ వెరీ సారీ మిస్ స్వప్నరాణీ! నేను బాధ్యతగల ప్రైవేట్ డిటెక్టివ్ ని దొంగను కాను. మీరు ఏ కిరాయి దొంగనైనా కలుసుకుని మీ పని జరుపుకుంటే మంచిది!" అన్నాడు దుర్యోధన్ కాస్త తీక్షణంగా.

దాంతో వారి మొహాలు చిన్నబోయాయి. నిరాశతో లేచి, మౌనంగా చేతులు జోడించి బైటికి నడిచారు. గుమ్మంవరకూ వెళ్ళిన స్వప్నరాణి ఎందుకో చటుక్కున

వెనుదిరిగి, హాండ్ బ్యాగ్ తెరుస్తూ దుర్యోధన్ని సమీపించింది.

బ్యాగ్‌లోంచి చిన్న నోట్‌బుక్ తీసి, ఏదో రాసి, పేజీ చింపి అతనికిస్తూ, "ఇందులో ఇక్కడ మేము బస చేసిన హోటల్ పేరూ, రూం నెంబర్, ఫోన్ నెంబర్ ఉన్నాయి. మీ నిర్ణయం మార్చుకుంటే దయచేసి మాకు ఫోన్ చెయ్యండి" అని వెనుదిరిగి చకచక వెళ్ళిపోయింది.

ఆ కాగితంవైపు చూశాడు దుర్యోధన్.

హోటల్ కార్వాన్.
రూం నెంబర్ 156
ఫోన్ నెంబర్ 143.

2

"డిటెక్టివ్ దుర్యోధన్ గారు ఉన్నారా?" అన్న సుతిమెత్తని కంఠం విని తలెత్తి చూశాడు అర్జున్.

పాతికేళ్ళపైనా ఉంటాయామెకు. కొత్త టూత్ పేస్టు ట్యూబులా నిండుగా, తెల్లగా ఉంది. జరీ అంచు ఎర్రని షిఫాన్ చీర, అదే రంగు బ్లౌజు. చేతిలో ముదురు నీలం హాండ్ బ్యాగ్. కోల ముఖం, కోటేరు ముక్కు. పెదాలకి ఎర్రని లిప్‌స్టిక్. బాబ్ హేర్.

అందంగానేవుందని చెప్పొచ్చు. సహజ సౌందర్యమూ, ఖరీదైన ఆ మేకప్ వల్లో అలా కనిపిస్తోంది. ఆమె వెనకే సుమారు ముప్పైఐదేళ్ళ వ్యక్తి నిల్చునున్నాడు. సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. నల్లపాంటూ, దానిపై ఖరీదైన హాఫ్ బ్లూ జర్కిన్ వేశాడు.

బుల్‌వర్కర్ కసరత్తు చేస్తాడేమో, మనిషి సన్నమే అయినా, చేతులు మాత్రం కండలు తిరిగి బలిష్టంగా ఉన్నాయి. కళ్ళకి అద్దాలు. కాళ్ళకి బూట్సు. ఫ్రెంచ్

కట్ గెడ్డం పల్చని జుత్తు.

"ఉన్నారు. రండి" అన్నాడు అర్జున్ లేస్తూ.

ఇద్దరూ లోన అడుగుపెట్టారు. వాళ్ళని సోఫాలో కూర్చోబెట్టి, డిటెక్టివ్ దుర్యోధన్ని పిల్చుకొచ్చాడు అర్జున్.

ఇద్దరూ లేచి చేతులు జోడించి, "నమస్తే!" అన్నారు.

నమస్కారం చేసి, "కూర్చోండి" అన్నాడు దుర్యోధన్.

అందరూ కూర్చున్నాక, "మీతో ఓ ముఖ్యమైన పనుండి వచ్చాము" అందా యువతి నమ్రతగా.

తలూపి, "చెప్పండి" అన్నాడు దుర్యోధన్ సిగరెట్ తీసి నోట్లో పెట్టుకుంటూ.

ఆ యువతి నవ్వి—"ముందు మా గురించి పరిచయం చేసుకోవాలి. నా పేరు స్వప్నరాశి...."

డిటెక్టివ్ లిద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

నోట్లో పెట్టుకున్న సిగరెట్ తీసి, "ఏమన్నారూ?" అడిగాడు దుర్యోధన్.

అతని ప్రవర్తన ఆమెకు అసహజంగా తోచింది కాబోలు. "నా పేరు స్వప్నరాశి!" అంది మళ్ళీ.

తనలోని ఆశ్చర్యాన్ని వ్యక్తం కానివ్వకుండా తలూపి, "వీరెవరు?" అడిగాడు దుర్యోధన్ ఆ వ్యక్తి వైపు చూపుతూ.

"మా మేనేజర్ దివ్యనాథ్ గారు!"

మరోసారి మొహాలు చూసుకున్నారు డిటెక్టివ్ లు ఆశ్చర్యంగా. ఎంత విచిత్రం! గంట క్రితం ఇలాగే ఓ యువతీ! ఆమె వెంట ఓ వ్యక్తీ వచ్చారు. ఆ యువతి

కూడా తన పేరు స్వప్నరాశి అని చెప్పింది. తనతో ఉన్న వ్యక్తి పేరు కూడా దివ్యనాథ్ అని చెప్పింది. కాకతాళీయమంటే ఇదేనా?

ఆమె అవేమీ పట్టించుకోకుండా తన ధోరణిలో చెప్పుకుపోతోంది. "....మీ గురించి పత్రికల్లో చాలా చదివాం! మాకు మీ సహాయం కావాలి. మీమీద ఎన్నో ఆశలు పెట్టుకుని వరంగల్ నించి వచ్చాము."

తలూపి, "ఏ విషయంలో మా సహాయం కావాలి మీకు?" అడిగాడు దుర్యోధన్ ఆసక్తి కనబరుస్తూ.

"వరంగల్ లో మాకు ఓ టెక్స్ టైల్ మిల్ ఉంది. మా నాన్నగారికి అక్కడి ధనిక వర్గంలో మంచి పరపతి ఉంది. మా ఇంట్లో తరతరాలుగా వస్తున్న, మా వంశ చిహ్నమైన ఓ వస్తువుండేది. దాన్ని మా నౌకర్లలో ఒకడు అతి చాకచక్యంగా దొంగలించి పారిపోయాడు. దాని ఖరీదు ఇప్పుడు పదిలక్షలకంటే తక్కువ ఉండదు."

"ఏమిటా వస్తువు?" అడిగాడు దుర్యోధన్ ఊపిరి బిగబట్టి.

"స్వర్ణమయూరం! ఐ మీన్ బంగారు నెమలి!!"

దిగ్భ్రాంతితో తమ ఆలోచనాశక్తి క్షణం స్తంభించి పోయినట్టు తోచింది డిటెక్టివ్ లకు. గంట వ్యవధిలో ఒకే పేరుగల ఇద్దరు యువతులూ, ఇద్దరు వ్యక్తులూ రావడం, ఇద్దరూ ఒకేరకం కథనం చెప్పడం కాకతాళీయం కాజాలదు. అంటే ఇద్దర్లో ఎవరో....

తన అనుమానం ముఖంలో వ్యక్తం కానివ్వకుండా జాగ్రత్తపడుతూ, "ఐసీ, ఐతే మీకా స్వర్ణ మయూరాన్ని వెతికిపెట్టాలన్నమాట!" అన్నాడు దుర్యోధన్.

ఈసారి ఆ వ్యక్తి కల్పించుకున్నాడు. "నో, నో!

మీకా శ్రమ అవసరంలేదు. అదెక్కడుందో మాకు తెలిసిపోయింది."

"మరి?"

"మీ పనల్లా ఆ నెమలి ఉన్న వ్యక్తినించి దాన్ని మాకు తెచ్చివ్వడమే! దీనికి మీరు కోరిన ఫీజు ఇచ్చుకుంటాము" అందా యువతి దీనంగా.

"ఎవరి దగ్గరుంది?"

"అండమాన్, నికోబార్ దీవుల కేంద్రమైన పోర్టు బ్లేయర్‌లో నివసించే ఓ కోటీశ్వరుడి దగ్గర! అతని పేరు గరుడప్పన్!

డిటెక్టివ్ లిద్దరూ మొహాలు చూసుకున్నారు మూడోసారి.

ఆమె తన ధోరణిలో చెప్పుకుపోతోంది. "అతనికి అమూల్యమైన వస్తువులు సేకరించే పిచ్చి ఉందిట. ముఖ్యంగా చరిత్రాత్మక వస్తువులు, ఆ దొంగ దగ్గరే అతను దాన్ని చవకగా కొనిపెట్టుకున్నాడు. అతను జగమొండి అనీ, తను సేకరించిన ఏ వస్తువూ ఎట్టి పరిస్థితిలోనూ తిరిగి ఎవరికీ అమ్మడనీ తెలిసింది.

"అందుకే మీ శరణుజొచ్చాం! మాకు మీ మేధాసంపత్తిమీద పూర్తి గురి ఉంది. మీరు మా అభ్యర్థనను తప్పక స్వీకరిస్తారని నమ్ముతున్నాము."

"ఎక్కడో వరంగల్లో ఉన్న మీ ఇంట్లో ఆ బంగారు నెమలి దొంగతనం జరిగింది. ఇప్పుడది ఎవరిదగ్గరుందో కూడా తెలిసిపోయింది. పోలీసులకు ఫిర్యాదుచేస్తే వాళ్లే నిక్షేపంగా దాన్ని ఆ వ్యక్తినించి స్వాధీనం చేసుకోవడమేగాక, దొంగ వస్తువు కొనిపెట్టుకున్నందుకు చట్టరీత్యా అతనిమీద చర్యకూడా తీసుకుంటారు కదా?

ఇంత దూరం మద్రాసువచ్చి నన్ను కలుసుకునే అవసరమే లేదు కదా?"

"అక్కడే ఉంది అసలు చిక్కు. అది మామూలు బంగారు నెమలికాదు. చరిత్రాత్మక వస్తువు. దేశ చరిత్రకు సంబంధించిన వస్తువులు ప్రభుత్వ సొత్తులుగా పరిగణించ బడతాయి. పురాతత్వశాఖకు వాటిపై పూర్తి హక్కు ఉంటుంది.

"ఆ మధ్య నిజాం నవాబు నగల గురించి తలెత్తిన దుమారం సంగతి నీకు తెలిసిందే కదా? ఆయన వారసులు ఆ నగల్ని అమ్మకానికి పెడితే, ఫ్రాన్స్‌కు చెందిన ఓ కోటీశ్వరుడు కోటానుకోట్లు కుమ్మరించి వాటిని కొన డానికి సిద్ధపడ్డాడు.

"ఐతే, ప్రభుత్వం జోక్యం చేసుకుని, కోర్టుద్వారా అమ్మకాన్ని ఆపేసింది. ఇప్పటికీ ఆ కేసు ఏమీ తెమీ తేలకుండా న్యాయస్థానంలో నానుతోంది! అంతెందుకు, ఈ మధ్య కాశ్మీరులో ఆనాటి కాశ్మీరు మహారాజుకు చెందిన అపార నిధి నిక్షేపం బయల్పడి దేశంలో ఎంతటి సంచలనం సృష్టించలేదు?

మేము పోలీస్ కంప్లెంట్ ఇస్తే మా బంగారు నెమలి ప్రాశస్త్యం బైటపడి అనేక సమస్యలు ఉత్పన్న మౌతాయి. తరతరాలుగా మా వంశ చిహ్నంగా వస్తున్న ఆ వస్తువును ఎట్టి పరిస్థితిలోనూ వదులుకోడం మాకిష్టం లేదు."

"ఏమిటి దాని చరిత్ర? అభ్యంతరం లేకపోతే చెప్పండి. తెలుసుకోవాలని చాలా ఆసక్తిగా వుంది."

"చల్లకొచ్చి, ముంత దాచడం దేనికి? చెబుతాను. మేము వరంగల్ వాస్తవ్యులం! ఒకనాడు ఆ

నగరాన్ని ఓరగల్లుగా వ్యవహరించేవారు. అది ఆనాటి కాకతీయ సామ్రాజ్య రాజధాని. ఆ ఓరగల్లును ఏలిన రుద్రమదేవి గురించీ, ఆమె మనవడు ప్రతాపరుద్రుని గురించీ చరిత్రలో మీరు చదివే వుంటారు.

"మా వంశ అగ్రజుడు వారి రాజ్యంలో ప్రధాన కొత్వాలుగా పనిచేసేవారట. శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన చేసిన సేవలకు మెచ్చి, చక్రవర్తి ఆయనకా స్వర్ణ మయూరాన్ని గౌరవ చిహ్నంగా బహూకరించారట. ఆనాటినించీ అది తరతరాలుగా మాకు చెందుతూ వస్తోంది. అందుకే పట్టుదలగా దానికోసం ఇంత ప్రయాస పడుతున్నాం!" అంటూ ముగించిందా యువతి.

దుర్యోధన్ మస్తిష్కం చురుగ్గా పనిచేయసాగింది. స్వర్ణ మయూరం గురించి ఆ ఇద్దరు యువతులూ చెప్పిన కథనంలో పెద్దగా తేడా కనిపించడంలేదు. మొదటి స్వప్నరాశి తాను విజయనగర వాస్తవ్యురాలనీ, తమ వంశ అగ్రజుడు విజయనగర సామంత రాజువద్ద సేనా పతిగా వుండేవాడనీ చెప్పింది.

ఈ స్వప్నరాశి తను వరంగల్ వాస్తవ్యురాలంటోంది. తమ వంశ అగ్రజుడు కాకతీయ రాజులవద్ద కొత్వాలుగా పనిచేసే వాడంటోంది. ఇద్దర్లో యెవరు నిజం చెబుతున్నారు? అదే తెలుసుకోవాలి తను.

"ఆ రెండో స్వప్నరాశి రావడంతో దుర్యోధన్‌కు ఆ విషయంలో స్వతహాగా చెప్పలేని ఆసక్తి యేర్పడింది. ఇద్దరు స్వప్నరాశులు! ఇద్దరికీ స్వర్ణ మయూరం కావాలి. ఇద్దరు పోర్టుబ్లేయర్‌లో నివసించే గరుడప్పన్ పేరు చెబుతున్నారు. సందేహంలేదు. వుంది. ఏదో మర్మం దాగి వుంది!

"సరే, మీ కేసు స్వీకరిస్తున్నాను. పోర్టుబ్లెయిర్ వెళ్ళి ఆ బంగారు నెమలి తెచ్చివ్వడానికి నా శాయ శక్తులా ప్రయత్నిస్తాను" అన్నాడు తలూపుతూ.

దాంతో వారి కళ్ళు తళతళమన్నాయి.

"థాంక్యూ సర్!" అన్నారు ముక్తకంఠంతో.

"ప్రస్తుతం మీరెక్కడ బసచేశారు?"

"అపోలో హోటల్. థర్డ్ ఫ్లోర్. రూం నెంబర్ ట్వెంటీసెవన్!"

"ఓ.కే. ఇక మీరు వెళ్ళవచ్చు. రేపే నేను పోర్టు బ్లేయర్ బైలుదేరతాను" అన్నాడు దుర్యోధన్ సిగరెట్ పీక ఏష్ట్రేలో నొక్కుతూ.

ఖర్చుల నిమిత్తం అడ్వాన్సుగా ఎంతివ్వమంటారు?" అడిగాడు దివ్యనాథ్ నెంబర్ టూ.

చెప్పాడు అర్జున్.

బ్రీఫ్ కేస్‌లోంచి డబ్బు తీసిచ్చి, రసీదు అందుకున్నా డతను.

తరవాత ఇద్దరూ లేచి, నమస్కారంపెట్టి బైటికి నడిచారు.

వాళ్ళలా వెళ్ళగానే టీపాయ్‌మీది టెలిఫోన్ ముందుకు లాక్కుని, హోటల్ కార్వాన్‌కు రింగ్ చేశాడు దుర్యోధన్. స్వప్నరాశి నెంబర్ వన్ ఆ హోటల్లోనే దిగినట్టు చెప్పింది.

"ఎస్, హోటల్ కార్వాన్ ప్లీజ్!" వినిపించింది అవతలినించి ఆపరేటర్ కంఠం.

"రూం నెంబర్ వన్ నాట్ సెవన్ కనెక్టు చెయ్యండి."

క్లిక్‌మన్న శబ్దం, "ఆఁ, మాట్లాడండి...."

"హలో! లాయర్ దివ్యనాథ్ స్పీకింగ్!" వినిపించింది అవతల.

"నేను డిటెక్టివ్ దుర్యోధన్ మాట్లాడుతున్నాను. ఉదయం మిమ్మల్ని డిసప్పాయింట్ చేసినందుకు క్షమించాలి. మీరు వెళ్ళాక నా నిర్ణయం మార్చుకున్నాను. మీరు కోరినట్టు పోర్టుబ్లేయర్ వెళ్ళి ఆ స్వర్ణ మయూరాన్ని తీసుకురావడానికి నిశ్చయించాం!"

"థాంక్యూ సార్! నేనూ, స్వప్నరాశీ నిజంగానే నిరాశపడ్డాం! సాయంత్రం విమానంలో తిరిగి వెళ్ళిపోడానికి తయారవుతున్నాం! మీ నిర్ణయం మారినందుకు చాలా సంతోషం! మీరు తిరిగి వచ్చేవరకూ మేమిక్కడే కాచుకుంటాం! ఎడ్వాన్స్‌గా మీకు డబ్బు కావలిస్తే చెప్పండి. ఇప్పుడే తెచ్చిస్తాను" అంటున్నాడతను ఉత్సాహంగా.

"మీరు రానవసరంలేదు. నా అసిస్టెంట్ వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాడు.... రేపు బైలుదేరి, సాధ్యమైనంత త్వరగా పని పూర్తిచేసుకుని, రెండు మూడు రోజుల్లో తిరిగి వచ్చేస్తాం!"

"అలాగే సార్! మీ అసిస్టెంట్ కోసం కాచుకుంటాను."

"ఓ.కే!" అంటూ రిసీవర్ దించి అర్జున్ వైపు తిరిగాడు దుర్యోధన్.

"ఈ కేసు విషయంలో నీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు సిగరెట్ తీస్తూ.

"వెరీ ఇంట్రెస్టింగ్ కేస్! నిజానికి ఈ రెండో స్వప్నరాశీ, దివ్యనాథ్‌లు రావడంతో నాలో ఉత్సాహం ఉరకలు వేస్తోంది, ఇందులోని మిస్టరీ తెలుసుకోవాలని.

మొదటి దివ్యనాథ్ ఆ స్వప్నరాశి ఫామిలీ లాయర్‌గా, రెండో దివ్యనాథ్ ఈ మెగారి మేనేజర్‌గా పరిచయ మయ్యారు మనకు, చిత్రంగా లేదూ?"

తలూపాడు దుర్యోధన్. "ముందు మనం పోర్టుబ్లేయర్ నివాసి అయిన ఆ గరుడప్పన్ గురించి పూర్తి సమాచారం తెలుసుకుని మన కార్యక్రమాన్ని రూపొందించుకోడం మంచిది" అంటూ ఫోన్ రిసీవర్ ఎత్తి, క్రయిం బ్రాంచి హెడ్‌క్వార్టర్స్‌కు రింగ్ చేశాడు.

"హలో! ఇటీజ్ క్రయింబ్రాంచ్ హెచ్. క్యూ ప్లీజ్!" వినిపించింది అవతల ఆపరేటర్ కంఠం.

"ఇన్‌స్పెక్టర్ యుగంధర రెడ్డికి కనెక్టు చెయ్యండి" చెప్పాడు దుర్యోధన్.

రెండు నిమిషాలు నిశ్శబ్దం.

"హలో, ఇన్‌స్పెక్టర్ యుగంధర రెడ్డి స్పీకింగ్!" వినిపించింది అవతల.

"నేను, డిటెక్టివ్ దుర్యోధన్ మాట్లాడుతున్నాను."

"చాలారోజుల తరవాత గుర్తొచ్చినట్టున్నాను. చెప్పండి. ఏం కావాలి?"

"సారీ రెడ్డిగారూ! పని వత్తిడివల్ల మిమ్మల్ని కలుసుకునే వీలు చిక్కలేదు. బావున్నారా?"

"ఏదో ఇలా ఛస్తున్నా! చెప్పండి అసలు విషయం!"

"పోర్టుబ్లేయర్‌లో ప్రస్తుతం పోలీస్ ఇంఛార్జిగా ఎవరున్నారు?"

"డి.ఎస్.పి. స్థాయి అధికారి. పేరు తెలీదు. ఉండండి, కనుక్కుంటాను. "ఐదు నిమిషాల నిశ్శబ్దానంతరం చెప్పాడు ఇన్‌స్పెక్టర్. "డి.ఎస్.పి. మహేంద్ర

నాథ్ గారు!"

"థాంక్స్!" అంటూ రిసీవర్ దించి, ఆ తరవాత టెలిఫోన్ ఎక్స్ఛేంజికి రింగ్ చేసి, పోర్టుబ్లేయర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు అర్జంట్ లైటెనింగ్ కాల్ బుక్ చేశాడు దుర్యోధన్.

ఈమధ్య మనదేశం పంపిన అంతరిక్ష ఉపగ్రహాల చలవతో కమ్యూనికేషన్ సౌకర్యాలు చాలా శీఘ్రగతిన వృద్ధి చెందాయి. ఎప్పుడు, ఏ మూల ఎవరితో మాట్లాడా లన్నా పట్టుమని పదినిమిషాలు కూడా పట్టడం లేదు.

అరగంటలోపలే పోర్టుబ్లేయర్ కు లైన్ దొరికింది.

"హలో, హు ఈజ్ స్పీకింగ్?" వినిపించింది అవతల.

"మహేంద్రనాథ్ గారూ, నమస్కారం! నేను డిటెక్టివ్ దుర్యోధన్ మాట్లాడుతున్నాను మద్రాసు నించి."

"నేను మహేంద్రనాథ్‌ని కానండీ! ఆయన పి.ఏ. సబ్ ఇన్‌స్పెక్టర్ వాసుని. ప్రస్తుతం ఆయన ఊళ్ళో లేరు. ఇన్‌స్పెక్టర్ టూర్ మీద వెళ్ళారు. ముఖ్య విషయమైతే చెప్పండి. ఆయన వచ్చాక తెలీజేస్తాను."

"అబ్బే, అంత ముఖ్య విషయమేంకాదు పోర్టు బ్లేయర్లో నివసించే గరుడప్పన్ అనే వ్యక్తి గురించి కొంత ఇన్ఫర్మేషన్ కావాలి నాకు. అతని వ్యక్తిగత విషయాలతో సహా."

"ఆ వివరాలు నేనే ఇవ్వగలను. ఏభై ఏళ్ళుంటా యతనికి. పోర్టుబ్లేయర్‌లో బాగా పరపతి వుంది. సిలోన్, సింగపూర్, బర్మా దీవులకి అతని స్వంత మినీ ఓడలు నడుస్తాయి. నగర శివార్లలో విడిగా అతని ఎస్టేట్ వుంది.

"అందులోనే అతని పాతకాలపు కోటను పోలిన ప్యాలెస్ వుంది. ఆ ప్యాలెస్‌లో అతను సేకరించిన అనేక చరిత్రాత్మక వస్తువుల అందమైన మ్యూజియం కూడా వుందిట. ఎంతో ముఖ్య అతిథులు వస్తే తప్ప ఆ మ్యూజియం చూట్టానికి అతను ఎవ్వరినీ అనుమతించడుట.

"ఆ ఎస్టేట్ రక్షణార్థం అతను చిన్నసైజు సెక్యూరిటీ పటాలాన్ని పోషిస్తున్నాడు. దాదాపు అందరు ధనవంతుల లాగే అతనిలోనూ రెండు బలహీనతలున్నాయి. మగువా, మధువూ!" అంటూ నవ్వాడు ఇన్‌స్పెక్టర్.

"థాంక్స్! వీలైతే త్వరలోనే మేమక్కడికి వస్తున్నాం! అప్పుడు మహేంద్రనాథ్ గార్ని కలుసుకుంటాము. ఆయనతో చెప్పండి నా గురించి. మద్రాసు క్రైంబ్రాంచి ఇన్‌స్పెక్టర్ యుగంధర రెడ్డి నా ఆప్తమిత్రుడు."

"తెలుసు. ఒకటి రెండుసార్లు మీ గురించి విన్నాను."

"వివరాలు తెల్పినందుకు మరోసారి థాంక్స్."

"మెన్షన్ నాట్ ప్లీజ్!" అవతల క్లిక్‌మంది.

రిసీవర్ దించి, పచార్లు ప్రారంభించాడు దుర్యోధన్. ఆ పచార్లు పరమార్థం అర్జున్‌కు బాగా తెలుసు. అందుకే మౌనంగా చూస్తూ కూర్చున్నాడు.

అరగంట తరవాత ఆగి, అతనివైపు తిరిగాడు దుర్యోధన్. "ఈ కేసులో మనం ముందుకు సాగడానికి ఓ పథకం రూపుదిద్దుకుంది నాలో. పోర్టుబ్లేయర్ వెళ్లాక అక్కడ మనం అమలు జరపాల్సిన కార్యక్రమంలో ఓ లేడీ ఇన్వెస్టిగేటర్ సహకారం అవసరం కావచ్చు.

"మద్రాసులో ప్రాక్టీసు చేసే లేడీ ఇన్వెస్టిగేటర్లలో షీలకు మంచి పేరుంది. ముందు నువ్వు కారావాన్ హోటల్ కెళ్ళి, దివ్యనాథ్ సెంబర్ వన్ని కలుసుకో.

అతనివద్ద అడ్వాన్సు రూపంలో ఫిఫ్టీ పర్సెంట్ ఫీజు వసూలుచేసి, అక్కణ్నించి తిన్నగా షీల ఆఫీసుకెళ్ళి, ఆమె నిక్కడికి తీసుకురా. ముగ్గురం కలిసి పథకాన్ని ఫైనల్ చేద్దాం!"

తలూపి లేచాడు అర్జున్.

3

ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో పోర్టుబ్లేయర్ ఏర్‌పోర్టులో దిగింది విమానం! ముగ్గురు డిటెక్టివ్‌లూ తమ తమ లగేజీలతో ఏర్ స్టేషన్ బైటికి నడిచి టాక్సీ ఎక్కారు.

అక్కడ ఒకేఒక టూరిస్టు హోటల్ వుంది. బ్లూ స్కై! ప్రోగ్రాం ప్రకారం మద్రాసునించి ముందే కేబుల్ పంపి ఆ హోటల్లో తమకోసం మూడు పేర్లతో రెండు గదులు బుక్ చేసుకోడంవల్ల టాక్సీ ఎక్కి తిన్నగా అక్కడికి చేరుకున్నారు డిటెక్టివ్‌లు.

"నా పేరు చక్రపాణి! ఇరవైతొమ్మిదో తేదీన మద్రాసునించి కేబుల్ పంపాం, రెండు గదులు బుక్ చెయ్యమని. అందిందా?" అడిగాడు దుర్యోధన్ రిసెప్షనిస్టుని.

అతను రిజిష్టర్ తిరిగేసి తలూపాడు. "అందింది. సెకండ్ ఫ్లోర్లో త్రీ నాట్ సిక్స్, త్రీ నాట్ సెవన్ రూములు" అంటూ వెయిటర్ని పిల్చి, వారి సామాను ఆ గదుల్లోకి తీసికెళ్ళమని చెప్పాడు.

హాల్లో తిరుగుతున్న మగాళ్ళు ఒకటికి రెండుసార్లు తమవెంట వున్న షీలను పరకాయించి చూడటం క్రీగంట గమనించాడు దుర్యోధన్. ఆమె అందం అటువంటిది. ఒక్కసారి చూసినంతమాత్రాన తనివితీరనిది. అందంలో

పాటు అపార తెలివితేటలూ, ప్రమాదాల నెదుర్కొనే ధైర్యసాహసాలు కూడా ఆమె సొత్తు!

వివరాలు రాయడానికి రిజిష్టర్ని దుర్యోధన్ ముందుకు తోశాడు రిసెప్షనిస్టు.

పేరు చక్రపాణి, వృత్తి వ్యాపారం, నివాసం మద్రాసు. పోర్టుబ్లేయర్ వచ్చింది విహారయాత్రకు, అని రాసి సంతకం పెట్టాడు దుర్యోధన్.

అర్జున్ తన పేరు వరహాలరావనీ, బిజినెస్ పనిమీద అక్కడికి వచ్చాననని రాసి సంతకం పెట్టాడు.

రెండో గది కేటాయించుకున్న షీల తన పేరు మీనాక్షి, వృత్తి లెక్చరర్, మద్రాసు నించి విహార యాత్ర నిమిత్తం వచ్చినట్టు రాసింది.

అద్వాన్స్ పుచ్చుకున్నాక కీ బోర్డులోంచి గదుల తాళంచెవులు తీసి వారి కందించాడు రిసెప్షనిస్టు.

"హోటల్ తరపున మాకోసం ఓ అద్దె కారు ఏర్పాటు చెయ్యగలరా?" అడిగాడు దుర్యోధన్.

అతను తలూపి, "ఇక్కడ అద్దె కార్లిచ్చే కంపెనీ ఒకటే వుంది. ఫోన్ చేసి కనుక్కుంటాను" అన్నాడు.

"థాంక్స్! మేము పైన ఎదురుచూస్తుంటాం! అరగంట తరవాత ముగ్గురికీ టిఫిన్లు పంపించండి" అంటూ లిఫ్ట్ వైపు నడిచాడు దుర్యోధన్.

గదుల్లో సామాను సర్దుకుని, స్నానాలు కానిచ్చి, బట్టలు మార్చుకోగానే ట్రాలీలో టిఫిన్లు తీసుకొచ్చాడు బేరర్. ముగ్గురూ ఒకే గదిలో కూర్చుని టిఫిన్ లారగిస్తుండగా, కిందినించి రిసెప్షనిస్టు ఫోన్ చేశాడు కారు వచ్చేసిందని.

టిఫిన్ పూర్తయ్యాక కిందికెళ్ళాడు దుర్యోధన్.

"డ్రైవర్ కావాలా?" అడిగాడు రిసెప్షనిస్టు.

"అవసరంలేదు."

"ఐతే ఇతనివెంట పోర్చ్‌లోకెళ్ళండి. కారు చూపిస్తాడు" అంటూ అక్కడే నిల్చున్న ఓ వ్యక్తిని చూపాడు రిసెప్షనిస్టు.

డ్రైవర్ వెంట బైటికెళ్ళి, పార్కింగ్ ప్లేస్‌లో ఆగివున్న చాక్లెట్ రంగు ఆస్టిన్ కారు చూశాడు దుర్యోధన్.

"మంచి కండిషన్‌లో వుంది. టాంకునిండా పెట్రోల్ పోయించుకొచ్చాను" అన్నాడతను.

తలూపి, తిరిగి రిసెప్షనిస్టు దగ్గరికెళ్ళి, డిపాజిట్ పైకం చెల్లించి, లిఫ్ట్‌వైపు నడుస్తూ రిస్టువాచీ చూసుకున్నాడు దుర్యోధన్. పదకొండు గంటలు.

"కారు వచ్చేసింది. ఇక ఆలస్యం చెయ్యకుండా మన పథకాన్ని అమలు చెయ్యడం మంచిది. అర్జున్! నువ్విక్కడే మాకోసం ఎదురుచూస్తూ వుండు. నేనూ, షీలా గరుడప్పన్ని కలుసుకోడాని కెళుతున్నాం!" అన్నాడు గదిలో అడుగుపెట్టి.

తలూపాడు అర్జున్.

షీల లేచి నిల్చుంది.

ఆమెతో కిందకెళ్ళి కార్లో కూర్చున్నాక, సిటీ మ్యాప్ విప్పాడు దుర్యోధన్. అక్కడి రోడ్లనూ, ముఖ్య ప్రదేశాలనూ పరిశీలిస్తూ, నగరం వెలపల వున్న గరుడప్పన్ ఎస్టేట్ దారిని క్షుణ్ణంగా మననం చేసుకుని, కారు స్టార్టుచేశాడు.

నగరంచుట్టి అక్కడికి చేరేసరికి గంటపట్టింది.

ఎత్తయిన ప్రదేశంలో పాతకాలపు రాజ నివాసంలా

కట్టిన ప్యాలెస్ అది. దాని చుట్టూ నిలువెత్తు ప్రహరీ గోడ. పెద్ద ఇనపఊచల గేటు. గేటుకిరుపక్కలా తుపాకులు పట్టుకుని, ఖాకీ యూనిఫాంలో కాపలా కాస్తున్న గార్డ్సు!

కారు గేటును సమీపించగానే, ఓ గార్డు దగ్గరికి వచ్చి, "ఎవరు కావాలి?" అనడిగాడు.

"గరుడప్పన్ గార్ని కలుసుకోడానికి వచ్చాం!" అన్నాడు దుర్యోధన్.

"మీ పేరు?"

"చక్రపాణి!"

"ఈ సమయంలో ఈ పేరుగల వారెవరూ ఇక్కడికి రాబోతున్నట్టు లోపలినించి మాకు వర్తమానం అందలేదే?"

"మేము యాత్రీకులం! అండమాన్, నికోబార్ దీవులు దర్శించడానికి వచ్చాం! గరుడప్పన్ గారి గురించి విన్నాక ఒకసారి వార్ని చూడాలనిపించింది."

గార్డు నఖశిఖ పర్యంతం వారిని పరీక్షగా చూడసాగాడు. షీలని చూస్తున్నప్పుడు అతని కళ్ళు తళతళ మెరవడం గమనించాడు దుర్యోధన్.

"ఉండండి. లోనికెళ్ళి కనుక్కొస్తాను. పేరేమిటన్నారూ?"

"చక్రపాణి! ఈమె మిస్ మీనాక్షి!"

అతను వెనుదిరిగి లోనికెళ్ళి, ఐదు నిముషాల తరవాత తిరిగివచ్చి, "రండి!" అన్నాడు గేటు తెరుస్తూ.

పాచిక పారింది! తనవెంట అందమైన అమ్మాయి ఉన్నట్టు తెలియగానే లోపలినించి తప్పక ఆహ్వానం వస్తుందని దుర్యోధన్‌కి తెలుసు. గేటుగుండా నెమ్మదిగా

కారుని కంపౌండ్లోకి పోనిచ్చాడు.

బృందావన్ గార్డెన్ని పోలిన కంపౌండది. ఏటు చూసినా రంగు రంగుల పూలతో విరబూసిన రకరకాల మొక్కలు, అందంగా కట్ చేసిన క్రోటన్ వరసలు. పోర్టికోని సమీపించేసరికి ఫుల్ సూటులో ఉన్న ఓ వ్యక్తి, అతని పక్కనే పోలీస్ ఇన్స్పెక్టర్ని పోలిన ఖాకీ యూనిఫాంలో ఉన్న పొడవాటి, వెడల్పాటి వ్యక్తి నిల్చుని కనిపించారు. అతని తోలు బెల్టు పౌచ్లో రివాల్వర్ వేలాడుతోంది.

బహుశా, అతను ఆ ఎస్టేట్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర యుంటాడు, అనుకుంటూ పోర్టికోలో కారాపాడు దుర్యోధన్. వారిని చూడగానే సాదరంగా స్వాగతం పలికాడు ఫుల్ సూటులో వున్న వ్యక్తి. కారు దిగి, అతనికి షేక్హాండ్ ఇచ్చాడు దుర్యోధన్. శీల చేతులు జోడించింది.

"నా పేరు సదాశివం. ఈయన మేజర్ పైగల్. ఎక్స్ ఆర్మీ. ప్రస్తుతం మా సెక్యూరిటీ అధికారిగా పనిచేస్తున్నారు. నేను ఈ ఎస్టేట్ మేనేజర్ని!" అంటూ తమని పరిచయం చేసుకున్నాడతను.

"మేము యాత్రికులం! ఇక్కడికి వచ్చాక తెలిసింది. గరుడప్పన్ గారికి చరిత్రాత్మక వస్తువులు సేకరించి తన హోమ్ మ్యూజియంలో భద్రపరిచే హాబీవుందని. అప్పటి నించీ మిస్ మీనాక్షి ఒక్కసారి ఆ మ్యూజియం చూడాలన్న కోరికతో ఉవ్విళ్ళూరుతోంది. మీరామెకా అవకాశం కల్పించగలరా?" అడిగాడు దుర్యోధన్.

అతనా మాటలు వింటున్నాడో లేదో తెలీదుగానీ, శీలని మాత్రం మెరిసే కళ్ళతో రెప్ప వెయ్యకుండా

చూస్తున్నాడు. "తప్పకుండా మిస్టర్ పాణీ! గరుడప్పన్ గారు ప్రత్యేకమైన వ్యక్తులకే తన మ్యూజియం చూపించడాని కనుమతిస్తారు.

సెక్యూరిటీగార్డు వచ్చి చెప్పగానే నే నాయన పర్మిషన్ తీసుకున్నాను. తన మ్యూజియం మీకు చూపించమని చెప్పారు, రండి. లోపలికి రండి" అంటూ వెనుదిరిగాడు సదాశివం.

అతన్ని అనుసరిస్తూ పోర్టికో మెట్లెక్కి వరండామీది కెళ్ళారిద్దరూ. వరండా కుడిపక్కన ఓ గ్లాస్ క్యాబిన్ వుంది. అందులో ఓ టేబిల్, రెండు కుర్చీలూ వేసి వున్నాయి. కేబిన్ తలుపు దగ్గర ఇద్దరు రక్షకభటులు తుపాకులతో సహా నిల్చు నున్నారు.

దాన్నిబట్టి ఆ ప్యాలస్ రక్షణ ఏర్పాట్లు చాలా పటిష్టంగా వున్నాయని అర్థం చేసుకున్నాడు దుర్యోధన్.

"క్షమించండి. ఇక్కడి ఆచారం ప్రకారం మీవద్ద విలువైన వస్తువులు, ఐ మీన్ వజ్రపుటుంగరాలూ, ఇతర వెండి, బంగారు వస్తువులేవైనా వుంటే వాటి వివరాలు ఈ క్యాబిన్‌లో పొందుపర్చాలి. ఆయుధాలేవైనావుంటే మాకప్పగించి లోనికెళ్ళాలి.

లోపలినించి బైటికి వచ్చాక, చాలా నిశితంగా మిమ్మల్ని సెర్చ్ చెయ్యవలసి వుంటుంది. గరుడప్పన్ గారి విషయంలో తప్ప, ఆయన బంధువులుగానీ, ఎస్టేట్ మేనేజర్ సదాశివంగారుగానీ లోపలినించి పూచికపుల్ల కూడా బైటికి తీసికెళ్ళడానికి వీల్లేదు" అన్నాడు సెక్యూరిటీ అధికారి.

"కష్టపడి సంపాదించిన వస్తువుల్ని కాపాడుకునే హక్కు ప్రతి ఒక్కరికీ వుంది. మీ ఏర్పాట్లను శిరసావ

హించడమేగాక వారిస్తున్నాను కూడా!" అంటూ తన వేలికున్న వజ్రపు టుంగరాన్నీ, చేతిగడియారానికున్న బంగారు పట్టానూ, జేబులోంచి వెండి సిగరెట్ కేస్, రివాల్వర్ తీసి, రిజిష్టర్లో పొందుపర్చి సంతకం పెట్టాడు దుర్యోధన్. తరువాత రివాల్వర్ని అతని కప్పగించాడు.

షీల తన చేతి బంగారు గాజుల్నీ, వజ్రపుటుంగరాన్నీ, చెవి దుద్దుల్నీ, రత్నాల నెక్లెస్నీ, రాయించి సంతకం పెట్టింది. తరవాత సెక్యూరిటీ సిబ్బంది ఇద్దర్నీ నిశితంగా పరిశీలించి, వేరే ఆయుధాలేవీ లేవని నిర్ధారించుకుని, లోపలి కెళ్ళడాని కనుమతించారు.

సదాశివం వెంట ప్యాలెస్లో అడుగుపెట్టారిద్దరూ. క్షణంపాటు మరో యుగంలో ప్రవేశించినట్టు తోచింది ఇద్దరికీ. అక్కడి వస్తువులూ, వాటిని అలంకరించినతీరూ చూస్తుంటే, పదమూడవ శతాబ్దపు రాజుల కాలంలో ఉన్నామా? అన్న భ్రాంతి కలిగింది.

"ముందు మీరేం చూడా లనుకుంటున్నారు?" అడిగాడు సదాశివం షీలని.

"నాకేం తెలుసండీ? మీరేది చూపినా, చూసి ఆనందించడం మా పని!" అంది షీల వ్యంగ్యంగా నవ్వుతూ.

"నా ఉద్దేశంలో ముందు మీరు పాలరాతి విగ్రహాలు చూసితీరాలి. గరుడప్పన్ గారు వాటిని లక్షలక లక్షలు ఖర్చుపెట్టి సేకరించారు. అందులో కొన్ని రోమన్ రాజుల కాలంనాటివీ వున్నాయి. వాటి పనితనం అద్భుతమైనదే కాదు, అద్వితీయమైనది కూడా!"

"ఐతే, చూసితీరాల్సిందే!"

"చక్రపాణిగారూ! మీకూ చూడాలని ఆసక్తిగా

ఉందా?"

తలూపాడు దుర్యోధన్.

వాళ్ళను వెంటబెట్టుకుని మ్యూజియం హాల్లోకి తీసి కెళ్ళాడు సదాశివం!

అక్కడ షో కేసుల్లో, క్రమపద్ధతిలో అమర్చిన చిత్ర విచిత్రమైన వస్తువులు చూసి ఇద్దరి కళ్ళూ విప్పారాయి.

పుర్రెకో బుద్ధీ, మనిషికో అలవాటూ వుంటాయంటారు. కొందరికి పోస్టల్ స్టాంపులు సేకరించి ప్రాణప్రదంగా భద్రపరిచే అలవాటుంటే, మరికొందరికి తాతల నాటి నాణాలు సేకరించి సంతోషించే పిచ్చి వుంటుంది.

ఐతే, గరుడప్పన్ అభిరుచి చాలా ఖరీదైనది. అమూల్యమైనది. పాలరాతి ప్రతిమలనించీ, ప్రాచీన కాలపు పిన్నీసు వరకూ ప్రతి వస్తువూ అందంగా అమర్చివున్నాయక్కడ. అన్ని వస్తువులకిందా, అవి ఏ కాలంనాటివో, ఎవరికి చెందినవో, వాటి చరిత్ర ఏమిటో వివరించే ప్లేట్స్ పెట్టి ఉన్నాయి.

ఐతే, ఎక్కడా తమకు కావలసిన బంగారు నెమలి జాడ కనిపించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది డిటెక్టివ్ లకు. దాని గురించి అడగడం కొరివితో తల గోక్కున్నట్టే!

అందుకే మౌనంవహించి, కాసేపు అవీ ఇవీ చూసినట్టు నటించి, "రండి సదాశివంగారూ! మీనాక్షి నింపాదిగా అన్నీ చూసొస్తారు. అంతవరకూ మనం బైట కూర్చుని మాట్లాడుకుందాం!" అన్నాడు దుర్యోధన్.

తలూపి, ఆమెకు అన్నీ వివరంగా చూపించమని ఓ నౌఖర్ని ఆదేశించి, దుర్యోధన్ వెంట బైటికి నడిచాడు సదాశివం. ముందు హాలుమధ్య మెత్తని మఖమల్

సోఫాలు వేసివున్నాయి.

"కూర్చోండి!" అంటూ ఓ సోఫాలో కూలబడ్డాడు సదాశివం.

దుర్యోధన్ కూర్చున్నాక, "ఏం తీసుకుంటారు? విస్కీయా లేక...." అడిగాడు.

"నో....నో! ఇప్పుడలాంటి డ్రింక్స్ తీసుకునే మూడ్ లేదు" అన్నాడు దుర్యోధన్ వారిస్తూ.

"ఐతే, కాఫీ తీసుకోండి" అంటూ చప్పట్లు చరిచి నౌఖర్లకు కాఫీలు తెమ్మని చెప్పి, "మీరేమీ అనుకోకుంటే ఓ వ్యక్తిగత ప్రశ్న అడగాలనుకుంటున్నాను" అన్నాడు సదాశివం రహస్యంగా.

"అడగండి."

"మిస్ మీనాక్షి మీ కేమౌతారు?"

సదాశివం వేసిన ఆ ప్రశ్నతో దుర్యోధన్ కనుబొమలు ముడిపడ్డాయి. "ఏమీ కాదు. మద్రాసునించి మేమిద్దరం ఒకే విమానంలో వచ్చాం! ఇక్కడ ఒకే హోటల్లో బసచెయ్యడంవల్ల పరిచయం ఏర్పడింది.

"ఆమెకి చరిత్రాత్మక వస్తువులు చూసి ఆనందించే పిచ్చి వుంది. మీ మ్యూజియం గురించి వినగానే చూసి తీరాలని పట్టుబట్టింది. ఆడది ఒంటరిగా రాలేదుకదా, నన్ను తోడురమ్మంటే వచ్చాను. అంతకిమించి ఆమెతో నా కెలాంటి సంబంధంలేదు."

"అంతేనా! నేను మరేదో అనుకున్నాను. వెరీగుడ్! ఇక దాగుడుమూతలు అనవసరం! మీరు దీనికి యెంత తీసుకుంటారు?"

"దేనికి?" అడిగాడు దుర్యోధన్ ఆశ్చర్యంగా.

"ఐ మీన్, ఆమె విషయంలో మీరెంత తీసుకుం

టారు?"

కోపంతో దుర్యోధన్ మొహం జేవురించింది. "మిష్టర్ సదాశివం! కాస్త మర్యాదగా మాట్లాడండి. ఆమె నా ఆస్తి కాదు, అమ్మడానికి. ఇంటికి వచ్చిన అతిథులకు మీరిచ్చే మర్యాద ఇదేనా?"

"ఛ....ఛ! మీరు అనవసరంగా కోపం తెచ్చుకుంటున్నారు. నా మాటల్లోని అంతర్యాన్ని ఇంకా మీరు అర్థం చేసుకోలేదు. నా ఉద్దేశమల్లా ఆమె విషయంలో నిశ్శబ్దంగా ఉండటానికి మీరేం తీసుకుంటారని!

గరుడప్పన్ గారికి అమూల్య వస్తువులు సేకరించడంతో బాటు అందమైన అమ్మాయిల పిచ్చి కూడా వుంది. మీనాక్షిది నిజంగా మగాణ్ని పిచ్చెక్కించే అందం! ఆమె మీకేమీ కాదని చెప్పారు కదా, మిగతా విషయాలు మాకు వదిలెయ్యండి. మీరు కేవలం నోరు విప్పకుండా వుండటానికి ఐదువేలు ఇవ్వబడతాయి. ఏమంటారు?"

వళ్ళు మండిపోయింది డిటెక్టివ్‌కు. "ఆమెతో నాకెలాటి సంబంధంలేదన్నది నిజమే! కానీ, ఆమె నన్ను నమ్మి, తోడు రమ్మంది. నైతిక దృష్ట్యా ఆమెను కాపాడే బాధ్యత నా పైన ఉంది."

"ఒక పరాయి యువతికోసం ఇలాటి బంగారు అవకాశాన్ని వదులుకుంటున్నారు మీరు. ఆమె కొంత కాలం ఈ ప్యాలెస్‌లో గడిపి వెళ్ళేటప్పుడు నిజంగా ఎంతో సంతోషిస్తోంది. కారణం, అప్పుడు ఆమెవద్ద కావలసినంత డబ్బూ, నగలూ వుంటాయి. మీపట్ల ఆమెకు యెలాటి కోపమూ వుండదు. గరుడప్పన్ గారు తనతో గడిపిన స్త్రీని బంగారంలో తూచి మరీ పంపి

స్తారు. ఆలోచించండి...."

చివాల్న లేచి నిల్చున్నాడు దుర్యోధన్. "సదాశివం! ఇక హద్దు దాటింది. మర్యాదగా మీ నాక్షిని పిలిపించండి. ఇహ ఒక్క క్షణంకూడా ఉండదలుచుకోలేదు" అన్నాడు పళ్ళుకొరుకుతూ.

సరిగ్గా అదే క్షణంలో వెనకనించి ఓ కంఠం వినిపించింది. "సదాశివం! మా అతిథికి కోపం తెప్పించి నువ్వు చాలా తప్పు చేశావు."

ఛటుక్కున వెనుదిరిగి చూశాడు దుర్యోధన్.

ఏభై ఏళ్ళుంటాయతనికి. అజానుబాహుడు. కారు నలుపు. లావుపాటి పెదాలు. మొహంమీద స్ఫోటకం మచ్చలు. పైకి దువ్వుతున్న పల్చని జుత్తు. ఖరీదైన సిల్కు చొక్కా. జరీ అంచు పట్టులుంగీ. చేతివేళ్ళకి ధగధగా మెరిసే వజ్రపుటుంగరాలు.

అతనే గరుడప్పన్!

"కూర్చోండి మిస్టర్ చక్రపాణీ! సదాశివం కారణంగా మీ మనసు నొచ్చుకుంటే అందుకు నేను క్షమాపణ చెప్పుకుంటున్నాను. మీ మాటల్నిబట్టి మా నివేదన మీకు నచ్చనట్టు తెలుస్తోంది" అన్నాడు గరుడప్పన్ ఓ సోఫాలో కూలబడుతూ.

"ఔను. మేము కేవలం మీ మ్యూజియం చూడ్డానికి వచ్చాం! ఈయన మాపట్ల ఇంత అమర్యాదగా ప్రవర్తిస్తారని ఊహించలేదు" అన్నాడు దుర్యోధన్ తిరిగి కూర్చుంటూ.

"ఇందులో అమర్యాద ఏమీ లేదు మిస్టర్ చక్రపాణీ! నాకు అందమైన అమూల్య వస్తువులు సేకరించడంతోబాటు, సజీవమైన అందాన్ని ఆస్వాదించే అలవాటుంది.

డబ్బంటే వాడు లక్ష్యంలేదు. అలాగే మీకూ ఆమెపట్ల ఎలాటి బాధ్యతా లేదు."

"నైతికంగా ఆమెని కాపాడే బాధ్యత నాపైన వుంది" అన్నాడు దుర్యోధన్ కటువుగా.

గరుడప్పన్ నవ్వి — "మీరు పొరబడుతున్నారు. ఆమెకిక్కడ యెలాటి ఆపదా వుండదు. ఆమె సగౌరవంగా కొన్నాళ్ళు మా ప్రత్యేక అతిథి రూపంలో వుంటుంది. ఇక మీ విషయం, ఐదువేల ఆఫర్ని పెంచి పదివేలు చేస్తాను. ఏమంటారు?"

"అయామ్ సారీ! ఇక ఈ విషయంలో మీతో ఏమీ మాట్లాడదలచుకోలేదు" అన్నాడు దుర్యోధన్ దృఢ స్వరంతో.

గరుడప్పన్ కనుబొమలు ముడివడ్డాయి. "అంటే మీ దృష్టిలో డబ్బుకు ఎలాంటి ప్రాధాన్యత లేదన్నమాట?"

"లేదు!"

"డబ్బుకు బదులు ఇంకేదైనా వస్తువు కావాలంటే, నేను సంతోషంగా ఇవ్వగలను. ఉదాహరణకి, నా మ్యూజియంలోని అమూల్యమైన బంగారు నెమలి ఇస్తే రాజీపడగలరా?"

గరుడప్పన్ అన్న మాటతో పక్కన ఆటంబాంబు పేలినట్టు అదిరింది గుండె. కాకతాళీయంగానే అతనా బంగారు నెమలి ప్రస్తావన ఎత్తాడా? లేక ....

"నేను మిమ్మల్ని చాలా ఆశ్చర్యపర్చినట్టున్నాను, మిష్టర్ పాణీ! ఇందులో దిగ్భ్రాంతి చెందాల్సిన పని లేదు. నా చేతులూ, చెవులూ చాలా పొడవైనవి. కూర్చోండి. ఇప్పుడే వస్తాను" అంటూ లేచి లోపలికి నడిచాడు గరుడప్పన్.

"బంగారు నెమలేమిటి? ఎక్కడుందది? మ్యూజియంలో కనిపించలేదే?" అడిగాడు దుర్యోధన్ ఆశ్చర్యాన్ని అభినయిస్తూ.

సదాశివం నవ్వి—"అటువంటి విలువైన వస్తువులాయన తమ ప్రత్యేక లాకర్ రూంలో భద్రపరుస్తారు. అతిథులకు వాటిని చూపాలంటే ఆయనే స్వయంగా చూపాలి. ఆ లాకర్ రూం తెరవడం అన్యులకసాధ్యం! పేరుమోసిన బ్యాంకుల్లో కూడా అటువంటి బలిష్టమైన లాకర్ గది లేదనుకుంటాను. బ్రహ్మాండమైన ప్రేలుడు శక్తిగల డైనమైట్స్ కూడా దాన్ని చెక్కుచెదర్చలేవు" అన్నాడు.

అంతలో గరుడప్పన్ వచ్చేశాడక్కడికి. అతని చేతిలో తళతళ మెరుస్తున్న బంగారు నెమలిని చూడగానే దుర్యోధన్ కళ్ళు విప్పారాయి. అతను సోఫాలో కూర్చుని, దాన్ని దుర్యోధన్‌కిస్తుండగా, మధ్యలో కలగ చేసుకున్నాడు సదాశివం!

"మిస్ మీనాక్షి మ్యూజియంలో శిల్పాలు చూస్తోంది. ఆమెకూడా దీన్ని చూస్తే ఆనందించవచ్చు."

"ఔను! తీసికెళ్ళి చూపెట్టిరా!" అంటూ నెమలిని సదాశివాని కందించాడు గరుడప్పన్.

అతను లేచి, లోపలికెళ్ళి పది నిమిషాల్లో తిరిగి వచ్చాడు.

"ఏమంది మీనాక్షి?" అడిగాడు గరుడప్పన్ నవ్వుతూ.

"అటువంటి అసమాన కళాఖండాన్ని చూసినందుకు ఎంతగానో కృతజ్ఞతలు చెప్పమంది!" అంటూ నెమలిని తిరిగి అతని కందించాడు సదాశివం.

"కేవలం చూసినందుకే ఆమె అంతగా కృతజ్ఞతలు చెప్పుకుంటే, దీన్ని బహుమతిగా స్వీకరిస్తున్న చక్రపాణి యేమంటాడో చూడాలి" అంటూ నెమలిని దుర్యోధన్ కందించాడు గరుడప్పన్.

నిండుగా పురివిప్పి, గుండ్రని గ్లోబ్ మీద నిల్చున్న నెమలి అది! గ్లోబ్ కింద టేబిల్ మీద అమర్చడానికి అనువుగా నాలుగు మూలల దిమ్మె వుంది. అంతా బంగారమే! నెమలి రెండు కళ్ళ స్థానంలో రెండు యెర్రని వజ్రాలు మెరుస్తున్నాయి.

"డిటెక్టివ్ దుర్యోధన్! ఈ బంగారు నెమలిని తెచ్చిస్తే స్వప్నరాశి ఏమిస్తానంది మీకు?" అన్న గరుడప్పన్ ప్రశ్నతో పిడుగు పడ్డట్టు అదిరిపడ్డాడు దుర్యోధన్.

"అలా ఆశ్చర్యపడకండి. నేను ముందే చెప్పాను. నా చేతులూ, చెవులూ చాలా పొడవైనవని. మీ వెంట వచ్చిన మిస్ మీనాక్షి యెవ్వరో కూడా నాకు తెలుసు. మద్రాసులో పేరుపొందిన లేడీ ఇన్వెస్టిగేటర్ షీలా కదూ?" అడిగాడు గరుడప్పన్.

ఇక దాచి లాభంలేదు. అతనికంతా తెలుసు. అతను సామాన్యుడు కాదనీ, ఆవులిస్తే పేగులు కొలిచే ఘటమనీ అర్థమైంది దుర్యోధన్ కు.

నవ్వి—"డబ్బు రూపేణా ఇంకా ఏ ఒప్పందమూ కుదరలేదు. పని పూర్తయ్యాక చెబుతానన్నాను. గరుడప్పన్ గారూ! నిజంగా మీరు సామాన్యులుకారు" అన్నాడు.

"ఆమాత్రం గ్రహించినందుకు థాంక్స్! స్వప్నరాశి

మిమ్మల్ని కలుసుకుని ఏమందో ముందు వివరంగా చెప్పండి. ఆ తరవాత నా కథనం వివరిస్తాను" అన్నాడు గరుడప్పన్ కాలుమీద కాలు వేసుకుని నింపాదిగా కూర్చుంటూ.

"తను విజయనగరంలో నివసించే రఘుపతినాయుడనే మాజీ జమీందారు కుమార్తెననీ, ఒకప్పుడాయనకో తమ్ముడుండేవాడనీ, తన బాల్యంలో ఆయన ఇల్లువిడిచి వెళ్ళిపోయాడనీ, ఇన్నేళ్ళ తరవాత బొంబాయిలో గొప్ప ధనవంతుడిగా ఆయన మరణించినట్లు తెలిసిందనీ.

"పిల్లలు లేని కారణంగా ఆయన ఆస్తంతా తనకు చెందేట్లు రాసిపోయాడనీ, ఐతే కోర్టువారిని నమ్మించడానికి వారసురాలు వారి వంశ చిహ్నమైన ఈ బంగారు నెమలిని చూపితీరాలని షరతు పెట్టాడనీ, ఆమె తండ్రి దీన్ని మీకు అమ్మేసినందువల్లా, ఒకసారి కొన్న వస్తువును మీరు మళ్ళీ అమ్మడానికొప్పుకోనందువల్లా యెలాగైనా దీన్ని మీనించి సంపాదించి తెమ్మనీ కోరింది!" అంటూ ముగించాడు దుర్యోధన్.

గరుడప్పన్ నవ్వాడు గట్టిగా. "బావుంది. చాలా చావుంది కథ! విజయనగర వాస్తవ్యుడైన రఘుపతి నాయుడు కుటుంబంతో నాకు చాలా సన్నిహిత సంబంధాలున్నాయి. ఆయన మరణించి చాలా కాలమైంది. ఇద్దరు కొడుకులు తప్ప ఆయన కసలు కూతుళ్ళే లేరు! అంతేకాదు, ఆయన తండ్రికి ఆయనొక్కడే కొడుకు. తమ్ముడు లేనేలేడు!

రఘుపతినాయుడు మరణానంతరం ఆయన యిద్దరు కొడుకులు ఆస్తి పంచుకుని విడిపోయారు. అందులో పెద్దవాడు విలాసాలు మరిగి అనేక అప్పులు నెత్తిన వేసుకుని

తనకు చెందిన అమూల్య వస్తువులు అమ్ముకోసాగాడు.

"అప్పుడే అతను తన వాటాలో వచ్చిన ఈ బంగారు నెమలిని నాకు పదివేలకమ్మేశాడు. ఇప్పుడు చెప్పండి. నాకు తెలిసిన ఈ వాస్తవానికీ, మీరు చెప్పిన కథనానికీ ఎక్కడైనా పొంతన వుందా?"

ఆశ్చర్యంతో దుర్యోధన్ బుర్ర స్తంభించిపోయింది కాసేపు. కేవలం పదివేలు ఖరీదుచేసే బంగారు నెమలి కోసం ఇద్దరు స్వప్నరాశులు, ఇద్దరు దివ్యనాథ్ లు రెండు విభిన్న కట్టుకథలు చెప్పి, కోరినంత ఫీజు చెల్లించి దాన్ని స్వంతం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నారా?

"ఇందులో యేదో నిగూఢ రహస్యం ఇమిడివున్నట్లు స్పష్టమౌతోంది. ఆ రహస్యమేమిటో నేనూ తెలుసుకోవాలనుకుంటున్నాను. ఈ బంగారు నెమలిని మీ వెంట తీసికెళ్ళండి! మద్రాసునించి స్వప్నరాశిని పోర్టుబ్లేయర్ కు రప్పించండి. దీన్ని మీరు సాధించారని తెలియగానే ఆమె రెక్కలు కట్టుకు వాలుతుంది. మీ ఫీజేమిటో పుచ్చుకుని ఆమెకు నెమలిని ఇచ్చెయ్యండి.

"తరవాత నీడలా ఆమెను వెంబడించి, దీన్నిఎక్కడికి తీసికెళుతుందో, ఏం చేస్తుందో కనుక్కోండి. ఈ పని చేసిపెట్టినందుకు నేనూ మీరు కోరిన ఫీజు ఇవ్వగలను. యేమంటారు?"

నవ్వాడు దుర్యోధన్. "ఈ నెమలికోసం ఒక్కరు కాదు, ఇద్దరు స్వప్నరాశులు నన్ను కలుసుకున్నారు. ఇద్దరూ వేరువేరు కథలు చెప్పారు. అందుకే నేనిందులో ఇంట్రెస్టు తీసుకున్నాను. ఆ ఇద్దర్లో యే స్వప్నరాశికి ఇవ్వమంటారు దీన్ని?"

అది వినగానే గరుడప్పన్ కనుబొమలు ముడిపడ్డాయి.

క్షణం ఆలోచించి అన్నాడు—"అలాగా! ఆ విషయం తెలీదు నాకు. ఐతే ఇందులో నిజంగా యేదో మర్మం దాగివుందన్నమాట. వాళ్ళిద్దర్లో యే స్వప్నరాశికి దాన్ని వ్వాలో మీరే నిర్ణయించుకోండి. నాకు మాత్రం ఆ మిష్టరీ యేమిటో తెలిసితీరాలి."

"దురదృష్టవశాత్తూ స్వప్నరాశి నా కళ్ళల్లో కారం చల్లి దీన్ని తీసుకు పారిపోతే?"

"నాకు మీ సామర్థ్యంమీద పూర్తి నమ్మకం వుంది. అలా యెన్నటికీ జరగదు!"

"ఒక వేళ నేనే ఈ నెమలి తీసికెళ్ళి యెన్నటికీ తిరిగి రాకుంటే?"

పకపక నవ్వాడు గరుడప్పన్. "నాకూ ఆ ఆలోచన రాకపోలేదు. అందుకే ఓ నిర్ణయానికి వచ్చాను. ఈ నెమలి మీ దగ్గరున్నంత కాలం మిస్ షీలా జామీను రూపంలో మా దగ్గరే వుంటుంది!"

కోపాన్ని ఆపుకోలేక చిఱుతలా అతనిమీదికి లంఘించబోయాడు దుర్యోధన్. అదేక్షణంలో అతని నడుంమీద పిస్తోలు మొనగుచ్చుకుంది. ఓరగా చూశాడు. మేజర్ సైగల్!

"మిష్టర్ దుర్యోధన్ ప్లీజ్, శాంతించండి. మీరు గొప్ప బలశాలి కావచ్చు. ముష్టియుద్ధంలో ఆరితేరిన వారు కావచ్చు. కాని, ఈ పిడికెడు పిస్తోలుముందు మీ శక్తి సామర్థ్యాలు యేపాటి?" అంటున్నాడు సేఫ్టీ కాచ్ వెనక్కి లాగుతూ.

"ఆవేశపడకండి దుర్యోధన్. నాకు పోట్లాటలంటే గిట్టవు. ప్రమాణ పూర్వకంగా చెబుతున్నాను. షీలా ఇక్కడున్నంత కాలం ఆమెనెవ్వరూ చెడు దృష్టితో

చూడరు. నా భార్యల దగ్గర ఆమె సగౌరవంగా మా ప్రత్యేక అతిథిగా వుంటుంది. ఆమెకే ఇబ్బందీ కలక్కుండా చూసే బాధ్యత నాది!" అన్నాడు గరుడప్పన్ శాంతంగా.

షీలపట్ల తనకు పూర్తి విశ్వాసం వుంది. కరాటే, జూడోవంటి మార్షల్ ఆర్ట్సులో ఆమె ఆరితేరింది. తనని తాను సులువుగా రక్షించుకోగలదు. సాలోచనగా తలూపాడు దుర్యోధన్.

"ఆల్ రైట్! మీరింతగా భరోసా ఇస్తుంటే మీ షరతుకు ఒప్పుకుంటున్నాను. మనిషిని మనిషే కదా నమ్మాలి. సరే, షీలను పంపించండి. ఆమెతో మాట్లాడాలి."

"తప్పకుండా. సదాశివం! వెళ్ళి ఆమెను పిల్చుకురా!" అన్నాడు గరుడప్పన్.

అతను వెళ్ళి షీలను పిల్చుకొచ్చాడు. దుర్యోధన్ వివరించాడు పరిస్థితి అంతా!

గరుడప్పన్ మాత్రం కన్నార్పకుండా ఆమెనే చూస్తున్నాడు.

కాసేపు ఆలోచించి, తలూపింది షీల. "ఆల్ రైట్! నేనిక్కడుండటానికి సిద్ధమే! మీరు వెళ్ళిరండి."

జాగ్రత్త సుమా, అన్నట్టు కన్ను గీటి, అందరిదగ్గరా సెలవు తీసుకుని, బంగారు సెమలితో బైటికి నడిచాడు దుర్యోధన్. అతన్ని గేటువరకూ సాగనంపడానికి వెనకే బైలుదేరాడు మేజర్ సైగల్.

కారెక్కి హోటల్ చేరగానే రిసెప్షనిస్టుని కలుసుకుని, మద్రాసునించి పోర్టబ్లేయర్ వచ్చే విమానం టైమింగ్స్ కనుక్కున్నాడు. ఉదయం ఎనిమిదిగంటలకు

మద్రాసు వెళ్ళి, సాయంత్రం ఆరుగంటలకు మద్రాసునించి బైలుదేరి, యేడుగంటలకు ఇక్కడికి చేరి, మళ్ళీ తొమ్మిది గంటలకు వెళ్ళిపోతుందట.

టైం చూసుకున్నాడు దుర్యోధన్. మధ్యాహ్నం మూడుగంటలు.

మద్రాసులోని హోటల్ కారవాన్, ఫోన్ నెంబర్ 1438 అర్జంట్ లైటెనింగ్ కాల్ బుక్ చేశాడు. ముందు స్వప్నరాశి నెంబర్ వన్ వచ్చి ఆ బంగారు నెమలికోసం తనని ప్రాధేయపడింది గనక, ముందు ఆమెనే పిలిపించి పరీక్షించాలని నిర్ణయించుకున్నాడు.

ఎక్కువ యెదురుచూడకుండానే దొరికింది లైన్. దివ్యనాథ్ పలికాడు అవతల. స్వర్ణమయూరాన్ని సాధించావనీ ఆరుగంటల ఫ్లైట్‌లో స్వర్ణరాశితో బైలుదేరి రమ్మనీ చెప్పగానే ఆనందం పట్టలేక దాదాపు అరిచినంత పని చేశాడతను.

రిసీవర్ పెట్టేసి, అర్జున్ని కలుసుకోడానికి గబగబ లిఫ్ట్‌వైపు నడిచాడు దుర్యోధన్.

4

రాత్రి సరిగ్గా ఎనిమిది గంటలకి తలుపు తట్టిన చప్పుడైంది.

అర్జున్ వెళ్ళి తలుపు తెరిచాడు.

స్వప్నరాశి, లాయర్ దివ్యనాథ్‌లు!

"రండి!" అన్నాడు దుర్యోధన్ పూర్తయిన సిగరెట్ ఏష్‌ట్రేలో నొక్కుతూ.

ఇద్దరూ లోనికి వచ్చారు. దివ్యనాథ్ చేతిలో బ్రీఫ్‌కేస్ వుంది.

"కూర్చోండి" అన్నాడు అర్జున్ తలుపు మూసి.

సోఫాలో కూర్చుని—"ఆ బంగారు నెమలిని మీరు తప్పక సాధిస్తారని నాకు తెలుసు. మీ ఫోన్ అందగానే నిర్జీవమైన నా శరీరంలో మళ్ళీ ప్రాణం వచ్చినట్టైంది" అంది స్వప్నరాశి.

"డబ్బు తెచ్చారా?"

"మీ ఫీజేనా? ఇదుగో, కూడా తెచ్చాం!" అంటూ బ్రీఫ్ కేస్ తెరిచి చూపాడు దివ్యనాథ్.

"ఖర్చులు కలిపి మొత్తం పదివేలు తీసుకోవాలనుకుంటున్నాను" అన్నాడు దుర్యోధన్ నిర్మొహమాటంగా.

"దానికేం ముందోసారి నాకా నెమలిని చూపించండి. ఇలా అంటున్నందుకు అన్యథా భావించవద్దు. నా తృప్తికోసం! అంతే" అంది స్వప్నరాశి.

సాలోచనగా తలూపుతూ వెళ్ళి, సూట్ కేస్ లోంచి నెమలిని తెచ్చి ఆమె కందించాడు.

స్వప్నరాశి రెండు నిమిషాలు దాన్ని పరీక్షగా చూసి, "మోసం! ద్రోహం! ఇది నకిలీ నెమిలి! మా అసలు నెమలి కాదు!!" అంది ఎర్రబారిన మొహంతో.

డిటెక్టివ్ లింకా ఆశ్చర్యంలోంచి తేరుకోనే లేదు. అప్పుడే బాల్కనీ దగ్గర "ఢాం!"మని పిస్తోలు పేలడం, గుండు "రుంయ్"మంటూ దుర్యోధన్ పక్కనించి దూసుకుపోవడం ఒకేసారి జరిగాయి. "అందరూ కిందపడిపోండి!" అంటూ రెప్పపాటులో నేలమీదికి దొర్లాడు.

దివ్యనాథ్ కిందపడి, జేబులోంచి రివాల్వర్ తీసి, గదిలో వెలుగుతున్న బల్బు పేల్చేశాడు. చీకటి! గదిలో ఎవరెక్కడున్నారో కనిపించని కటిక చీకటి!

అంతలో "ఢాం!" మంది పిస్తోలు.

ఎవ్వరో వాటర్ పైప్ గుండా బాల్కనీలోకి దిగి పోతున్నారు. ఎవ్వరు?

ఐదు నిమిషాలు నిశ్శబ్దం!

మరో ఐదునిమిషాలు ఓపిగ్గా కాచుకున్నారు. వారి ఊపిర్లు తప్ప ఎలాటి అలికిడీ లేదు. ఇహ లాభంలేదని నిశ్శబ్దంగా బాల్కనీవైపు పాకసాగాడు దుర్యోధన్. బాల్కనీ దగ్గరికి చేరి పరీక్షగా చూశాడు. ఎవ్వరూ లేరు! పారిపోయాడా?

చటుక్కున లేచి కిందికి చూశాడు. మసక చీకట్లో ఓ మానవాకారం, హోటల్ ముందు భాగంవైపు పరిగెత్తుతోంది. వెళ్ళి వెతకడం వ్యర్థం! కిందికెళ్ళేలోగా ఆ చుట్టుపక్కల అతని ఛాయలు కూడా కానరావు.

తీవ్రంగా యోచిస్తూ బాత్ రూంలోకెళ్ళి, అక్కడి బల్బుతీసి గదిలో అమర్చాడు.

"ఇక లేవండి. పారిపోయాడు రాస్కెల్!"

అందరూ లేచి నిల్చున్నారు. "వాడెవడోగానీ ఈ నెమలి కాజెయ్యడానికే వచ్చుంటాడు" అంటూ పిస్తోలు జేబులో వేసుకున్నాడు దివ్యనాథ్.

స్వప్నరాశి, చేతిలో ఉన్న నెమలిని టీపాయ్‌మీద పెట్టి, "ఇహ పదండి లాయర్ గారూ! నాకు చచ్చే భయంగా ఉందిక్కడ. మనం ఇంత దూరంవచ్చి దండగే అయింది" అంది.

"దుర్యోధన్ గారూ! మమ్మల్ని మీరిలా మోసం చేస్తారని కల్లో కూడా ఊహించలేదు" అన్నాడు దివ్యనాథ్ బ్రీఫ్ కేస్ మూస్తూ.

"గరుడప్పన్ స్వయంగా దీన్ని నా చేతికిచ్చాడు. ఇది అసలైనదో, కాదో నాకేం తెలుసు?" అన్నాడు

దుర్యోధన్ జేవురించిన మొహంతో.

"మీరు మా ఆశలన్నీ వమ్ము చేశారు. సరే, యేం చేస్తాం? ఇక వెళతాము. గుడ్ బై పద స్వప్నా!" అన్నాడు దివ్యనాథ్ బ్రీఫ్ కేస్ అందుకుంటూ.

వెళ్ళిపోతున్న ఇద్దర్నీ గుడ్లు తేలేసి చూస్తుండి పోయారు డిటెక్టివ్‌లు.

"చాలా ఆశ్చర్యంగా వుంది. పిస్తోలు పేల్చినవాడు యేమీ సాధించకుండానే ఎందుకు పారిపోయాడు?" అడిగాడు అర్జున్.

"నాకూ అదే అర్థం కావడంలేదు" అన్నాడు దుర్యోధన్ సోఫాలో చతికిలబడుతూ.

"ఆ గరుడప్పన్ గాడే మిమ్మల్ని మోసం చేసుండాలి. అంత విలువైన వస్తువు ఆటువంటి కిలాడీ మీ కెందుకిస్తాడు? మొదటినించీ ఈ కేసే అగమ్యగోచరంగా వుంది!"

దుర్యోధన్ పలకలేదు. టీపాయ్‌మీది బంగారు నెమిలి అందుకుని అటూ ఇటూ తిప్పిచూస్తూ ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. గరుడప్పన్ ఇంట్లో చూసినప్పుడు దాని ఎడమకాలి వేళ్ళలో ఒకటి కిందికి వంగి వుండటం గమనించాడు తను.

బహుశా పెట్టేటప్పుడూ, తీసేటప్పుడూ దేనికో తగిలి వంగి వుంటుందనుకున్నాడు. కాని, ఈ నెమలి వేళ్ళన్నీ సరిగ్గానే వున్నాయి. ఇంతసేపూ ఇది తన దగ్గరే వుందే! ఆ వంకర వేలు ఎలా చక్కబడింది? అప్పుడు స్ఫురించింది అసలు సంగతి!

"అర్జున్! మనం మోసపోయాం! నిలువునా బోల్తాపడ్డాం!" అన్నాడు పట్టరాని ఉద్వేగంతో.

"ఏం జరిగింది?" అడిగాడు అర్జున్ అర్థంగాక.

"ఇది నకిలీ నెమలి!"

"ఆ సంగతి స్వప్నరాణి ఇంతకుముందే చెప్పిందిగా?"

"నీకర్థం కాలేదు. నేను గరుడప్పన్ దగ్గర్నించి తెచ్చిందే అసలు నెమలి! ఇప్పుడు నా చేతిలో వున్నది నకిలీ నెమలి!! వాళ్ళిద్దరూ మనల్ని బోల్తా కొట్టించి అసలు నెమలి కాజేసి ఈ నకిలీ నెమలి వదిలిపోయారు. ఆ విధంగా వాళ్ళు అసలు నెమలిగా నేగాక, మన ఫీజూ తన్నుకు పోయారు!"

"ఎలా?"

"మద్రాసునించి వచ్చేటప్పుడే వాళ్ళు తమవెంట ఓ మనిషిని తెచ్చుకునుంటారు. లేదా, ఇక్కడే వున్న వారి మనిషికి ఫోన్ చేసి వుంటారు. వాటర్ పైప్ గుండా బాల్కనీలో దిగి, పిస్తోలు పేల్చమని.... ఆ సాకుతోసమే దివ్యనాథ్ రివాల్వర్ తీసి గదిలోని లైటు యెగరగొట్టేశాడు.

"ఆ చీకట్లోనే నెమళ్ళ మార్పిడి జరిగిపోయింది.... తరవాత నకిలీ నెమలి తెచ్చానని ఆరోపించి, ఇద్దరూ చల్లగా జారుకున్నారు."

"స్థానిక పోలీసుల సాయంతో వారికోసం గాలిస్తే?"

పెదవి విరిచాడు దుర్యోధన్. "అటువంటి జిత్తుల మారి నక్కలు అంత సులభంగా పట్టుబడతారనుకోడం కల్ల! ఈ పాటికి వాళ్ళు చేరుకోలేని దూరానికి పారిపోయుంటారు. ఈ సంగతి గరుడప్పన్‌కు తెలిస్తే, మనల్ని ప్రాణాలతో ఈ దీవినించి కదలనివ్వడు. ఆ నెమలికి బదులు షీల అతని దగ్గరుంది. ఆమె గురించే బెంగపడుతున్నాను."

"ఏం చేద్దామంటా రిప్పుడు?"

"చెయ్యాలి. ఏదో ఒకటి చెయ్యక తప్పదు. ఆలోచించి పథకం అల్లుతాను. నువ్వు పడుకో!" అన్నాడు దుర్యోధన్ సిగరెట్ అంటిస్తూ.

5

"రాత్రంతా ఆలోచించి ఓ ప్లాన్ రూపొందించాను. త్వరగా లెములు. స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కెళ్ళి డి.ఎస్.పి.ని కలుసుకోవాలి" అన్నాడు దుర్యోధన్ సూట్‌కేస్ తెరుస్తూ.

తలూపి, బాత్‌రూంలో దూరాడు అర్జున్.

సూట్‌కేస్ అడుగులోంచి అరంగుళాల పొడవూ, రెండంగుళాల మందం వున్న తెల్లని కొవ్వొత్తుల్నిపోలిన ఆరు కడ్డీలు తీశాడు దుర్యోధన్. వాటిని మూడు మూడు చొప్పున విడగొట్టి పాంటు పైకెత్తి పిక్కల దగ్గర వెడల్పాటి రబ్బర్ బాండ్స్‌తో బిగించుకున్నాడు.

అర్జున్ తయారయ్యాక టిఫిన్ కానిచ్చి కారెక్కాడు.

అరగంటలో చేరుకున్నారు హెడ్‌క్వార్టర్స్.

వారి పేర్లు వినగానే డి.ఎస్.పి. పర్సనల్ అసిస్టెంట్ సబ్ఇన్‌స్పెక్టర్ వాసు లేచి కరచాలనం చేశాడు. "మహేంద్రనాథ్‌గారు క్యాంపునించి ఇంకా రాలేదు. చెప్పండి. నావల్ల ఏదైనా సహాయం కావలిస్తే, తప్పక ప్రయత్నిస్తాను" అన్నాడు సాదరంగా.

"ప్రస్తుతం ఓ మోటార్ బోట్ అవసరమైంది మాకు."

"అంతేనా! ఇక్కడి ప్రజలకు చేపలు పట్టడమే ముఖ్య వృత్తి. లెక్కలేనన్ని మోటర్‌బోట్లు దొరుకుతాయి. నో ప్రాబ్లమ్. మీరు వ్యక్తిగతంగా వెళ్ళి

అడిగితే ఇవ్వరుగానీ, పోలీసులం, మేము కోరిన వెంటనే యేర్పాటుచేస్తారు. ఎప్పుడు కావాలి మీకు?"

"రెండు మూడు గంటల్లో దొరికితే బావుంటుంది."

"ఆల్ రైట్! ఇప్పుడే ప్రయత్నిస్తాను."

అతనికి థాంక్స్ చెప్పి, అర్జున్‌తో బైటికివచ్చి, నువ్విక్కడే వుండు. ఆ మోటర్ బోట్ దొరికిన వెంటనే రేవు దగ్గర మాకోసం కాచుకో. నేనూ, షీలా యే క్షణంలోనైనా అక్కడికి వస్తాం! ఆ తరవాత చెబు తాను యేం చెయ్యాలో!" అంటూ కారెక్కి ముందుకు పోనిచ్చాడు దుర్యోధన్.

గరుడప్పన్ ఇంటిముందు కారాపగానే కాపలాదారు వచ్చి, "ఎవరు కావాలి?" అనడిగాడు.

తన పేరు చెప్పి, "గరుడప్పన్ గార్ని కలుసుకోవాలి" అన్నాడు.

అతను లోనికెళ్ళి, పదినిమిషాల తరవాత వచ్చి, గేటు తెరిచాడు. "వెళ్ళండి."

కారు కాంపౌండ్లోకి పోనివ్వగానే, పోర్టికోలో నిల్చుని కనిపించాడు సదాశివం.

కారాపి అతనికి షేక్‌హేండ్ ఇచ్చాడు దుర్యోధన్.

"రండి. బాస్ డైనింగ్ హాల్లో ఎదురుచూస్తున్నారు" అంటూ లోనికి నడిచాడు సదాశివం.

అతన్ని అనుసరిస్తూ ఓరగా సెక్యూరిటీ క్యాబిన్ వైపు చూశాడు దుర్యోధన్. మేజర్ సైగల్, ఇద్దరు గార్డులూ వున్నారక్కడ. తన రివాల్వర్ నిన్ననే వారికప్పగించ డంవల్ల ఈ రోజు సోదా చెయ్యడం అనవసరమనుకున్నా రేమో, వదిలేశారు.

సదాశివం వెనక తిన్నగా డైనింగ్ హాల్లో అడుగు

పెట్టాడు దుర్యోధన్. వెడల్పాటి డైనింగ్ టేబిల్ కిరుపక్కలా గరుడప్పన్, షీలా కూర్చున్నారు.

దుర్యోధన్ని చూడగానే, గరుడప్పన్ గారపళ్ళికి లించి, "గుడ్ మార్నింగ్ డిటెక్టివ్! రండి. కూర్చోండి" అన్నాడు కుర్చీ చూపుతూ.

షీల పక్కన కూర్చుని, "ఎలా వుందిక్కడ?" అడిగాడు దుర్యోధన్.

"చాలా బావుంది. గరుడప్పన్ గారు నిజంగా మంచి అతిథి పారాయణులు" అంది షీలా.

"టిఫిన్ చల్లారిపోతోంది. కానివ్వండి" అన్నాడు గరుడప్పన్ తనే స్వయంగా దుర్యోధన్ ప్లేట్లో వడ్డిస్తూ.

తినాలని లేకున్నా మర్యాదకోసం వారికి కంపెనీ ఇవ్వసాగాడు దుర్యోధన్.

టిఫిన్ ముగించి కర్చీఫ్తో చేతులు తుడుచుకుంటూ చాలా నింపాదిగా అన్నాడు గరుడప్పన్. "మిస్టర్ దుర్యోధన్! మీరు దొంగల్ని, హంతకుల్ని పట్టుకోడంలో చాలా ఘటికులనీ విన్నాను. అలాగే, దొంగతనం చెయ్యడంలోనూ మీకు మంచి ప్రావీణ్యం వుందని నిన్ననే తెలిసింది నాకు!"

నివ్వెరబోయి చూశాడు దుర్యోధన్. "ఇది యే రకం జోకో నాకర్థం కాలేదు!"

గరుడప్పన్ నవ్వి—"ఏమీ తెలియనట్టు నటించడంలోనూ మీరు సిద్ధహస్తులేనని తెలుస్తోంది" అన్నాడు.

"చెప్పేదేదో సూటిగా చెప్పండి" అన్నాడు దుర్యోధన్ తీక్షణంగా.

"చెబుతాను. వినండి. నిన్న మీరు ఆ బంగారు నెమలితోబాటు నా మ్యూజియంలోని అతి విలువైన

పాతిక లక్షల వజ్రాల హారంకూడా కాజేశారు. నేర పరిశోధనలాగే మీరుచేసే దొంగతనం తీరుకూడా అద్వితీయమైనది. నా జీవితంలో మీవంటి వ్యక్తిని మొదటి సారి చూశాను" అన్నాడు గరుడప్పన్.

"వాటార్ యూ టాకింగ్ నాన్సెన్స్! నిన్న ఇక్కడున్నంతసేపూ మీరూ, సదాశివం నా వెంటే వున్నారు. అలాంటప్పుడు హారాన్ని ఎలా తీసికెళ్ళాను?" అరిచాడు దుర్యోధన్.

"అరవకండి. అదే నేనూ తెలుసుకోవాలనుకుంటున్నాను. ప్రత్యక్షంగా మేం మీ ఎదుట వున్నా, మీరు దాన్ని యెలా తన్నుకుపోయారు? మ్యూజియంలో అది యెక్కడ పెట్టబడిందో ఎలా తెలుసు మీకు?" అడిగాడు గరుడప్పన్.

"నిజంగా నాకేమీ తెలీదు. నమ్మండి."

"ఐదే, దాన్ని నాకు ఇవ్వదలచుకోలేదన్నమాట!"

"మీ దగ్గర అటువంటి వజ్రాలహారం వున్నదీ, లేనిదీ కూడా తెలీనప్పుడు నేను దొంగిలించే ప్రసక్తిలేదు. ఇంటికి వచ్చిన అతిథుల్ని ఇలా అనుమానించడం మీ ఆచారమా?"

"డిటెక్టివ్! నువ్విప్పుడు మద్రాసులో లేవు. సముద్రం మధ్య పోర్టుబ్లేయర్లో వున్న సంగతి మరువక! ఇంతవరకూ నీకిచ్చిన మర్యాద చాలు. నా హారాన్ని యే విధంగా కాజేశావో, కాజేసి యెక్కడ దాచావో మర్యాదగా చెబితే సరి. లేదా, నా దగ్గర అనేక పద్ధతులున్నాయి.

ఆ పద్ధతులుపయోగించానంటే ప్రాణంలేని శవాలు కూడా పలకడం ప్రారంభిస్తాయి. ఆ స్థితి రాకముందే

ఋద్ధిగా చెప్పెయ్!" అన్నాడు గరుడప్పన్ కర్కశంగా.

"ఒక్కసారి కాదు, వెయ్యిసార్లు చెబుతాను. ఆ హారం నా దగ్గర లేదు!"

నెమ్మదిగా చప్పట్లు చరిచాడు గరుడప్పన్.

వెంటనే ఓ వస్తాదులాంటి వ్యక్తి వచ్చాడు లోనికి. బోడిగుండు. ఒంటిమీద కేవలం నల్లపాంటు. కసరత్తు చేసి, కండలు పెంచిన పిండం!

"ఓహో! ఈ బుల్ డాగ్ ద్వారా నన్ను చిత్రగొట్టించి, ఆ హారం సంగతి కనుక్కోవాలనుకుంటున్నావా?" అడిగాడు దుర్యోధన్ నింపాదిగా.

"నో, నో! నిన్ను వాడికప్పగించడం చాలా ప్రమాదం! యెందుకంటే, వాడి పూర్తి శక్తి యెంతో వాడికే సరిగ్గా తెలీదు. ఒకటి రెండు దెబ్బలు కొట్టి నీ ఎముకల్ని ఎండుపుల్లల్లా విరిచేయగలడు. దురదృష్టవశాత్తూ తగలని చోట దెబ్బ తగిలితే, నీవు పైలోకం వెళ్ళే ప్రమాదముంది. నా హారం నాకు దొరక్కముందే నీవు చావడం నాకిష్టంలేదు. అందుకే ఓ పద్ధతి ఆలోచించాను."

"ఏమిటది?"

"శత్రువు బలహీనమైన నరం పసిగట్టి, దానిమీదే దెబ్బతియ్యడం విజ్ఞుల లక్షణం! నీ బలహీనతేమిటో నాకర్థమైంది. మిస్ షీలను హింసిస్తే అది చూసి విధిలేక నీ నోరు తెరుచుకుంటుందనుకుంటాను...." అంటూ షీల వైపు తిరిగి, "మిస్ షీలా! కాస్త ఆ కుర్చీలోంచి లేచి నిల్చుంటావా?" అడిగాడు గరుడప్పన్ నవ్వుతూ.

షీల బెదిరిన లేడిలా దుర్యోధన్ వైపు చూసింది.

"మిస్ షీలా! చెప్పేది నీకే! మా పహిల్వాన్ తలుచుకుంటే, నిన్ను ఒక చేత్తో ఎత్తి ఇరవై గజాల దూరం

విసిరెయ్యగలడు. బుద్ధిగా చెప్పినట్టు చెయ్!" అన్నాడు గరుడప్పన్ ఈసారి కటువుగా.

ఆమెను లేచి నిల్చోమన్నట్టు సైగ చేశాడు దుర్యోధన్.

"మిస్టర్ డిటెక్టివ్! ఈమె గులాబీరంగు ఒంటిమీద నల్లని వాతలు పడుతుంటే చూసి, నీ జ్ఞాపకశక్తి వెంటనే తిరిగి వస్తుందనుకుంటాను" అన్నాడు గరుడప్పన్ నవ్వుతూ.

"వద్దు, వద్దు! హారం ఇక్కడే నా దగ్గరే వుంది" అన్నాడు దుర్యోధన్ రాజీకి వస్తూ.

గరుడప్పన్ విరగబడి నవ్వి—"వెరీ గుడ్! పాపం, షీలని ఆ యాతనలు పడకముందే కాపాడావు. నాకు తెలుసు, హారం నీ దగ్గరే వుందని. యేదీ దాన్ని తీసి ఈ బల్లమీద పెట్టు చూద్దాం!" అన్నాడు.

రెప్ప మూసి తెరిచేలోగా వంగి, కుడికాలి పిక్క నించి ఆ కొవ్వొత్తిలాంటి వస్తువు లాగి, కోటు జేబు లోంచి గ్యాస్ లైటర్ తీసి లేచాడు దుర్యోధన్. అందరూ యేమీ అర్థంకాక గుడ్లప్పగించే చూడసాగారు.

బటన్ వత్తి లైటు వెలిగించాడు దుర్యోధన్. దాన్ని ఆ వస్తువుకు దగ్గరగా పట్టుకుని—"గరుడప్పన్! ఇటువంటి విషమపరిస్థితుల్ని ఎలా ఎదుర్కోవాలో నాకు బాగా తెలుసు. నా చేతిలో వున్నది కొవ్వొత్తి అనుకునేవు. కాదు. శక్తివంతమైన డైనమైట్! యెవ్వరైనా యే చిన్న పిచ్చి పనిచేసినా లైటర్‌తో డైనమైట్ వత్తి వెలిగిస్తాను. తరవాత యేం జరుగుతుందో మీకు బాగా తెలుసు" అన్నాడు నవ్వుతూ.

ఆ హఠాత్పరిణామంతో కొద్ది క్షణాలు యెవ్వరి

నోటా మాట పెగల్లేదు. అందరూ స్తబ్ధులై చూడసాగారు. సదాశివం తేరుకున్నాడు కాబోలు, చటుక్కున లేవబోయాడు.

తెలివి తక్కువ పని చెయ్యక! నేను ఊరికే బెదిరించడంలేదు. నిజం తెలుసుకోవాలంటే ప్రయత్నించి చూడు. తరవాత చింతించి ప్రయోజనం వుండదు" అన్నాడు దుర్యోధన్ హెచ్చరిస్తూ.

"డైనమైట్ పేల్చావంటే, మాతోబాటు నువ్వూ, షీలా ఇక్కడే మసి అవుతారు. అది ఆలోచించావా?" అడిగాడు గరుడప్పన్.

నవ్వి—"ఆ మాత్రం గ్రహించే బుర్ర నాకూ వుంది. మీ చేతుల్లో చిత్రహింసలుపడి మా కిష్టం లేని చావు చావడంకంటే మాకు మేముగా ఇష్టపడి చావడం గౌరవప్రదం! ఏ నాడైతే మేమీ వృత్తి ప్రవేశించామో, ఆ నాడే మా ప్రాణాలను వృత్తికి కుదువబెట్టాం!

"మీ ప్రాణాలమీద మీకు తీపివుంటే, బ్రతకాలనుకుంటే కిక్కురు మనకుండా కూర్చోండి. పద షీలా!" అంటూ వారినే చూస్తూ తలుపుని సమీపించాడు దుర్యోధన్.

షీలతో తలుపు రెక్క పక్కన నక్కి—"మేజర్ సైగల్ కమాన్! హరియివ్!" అన్నాడు బిగ్గరగా.

లోపల ఏం జరిగిందోనని ఖంగారుపడుతూ వెంటనే గార్డులతోసహా పరిగెత్తుకొచ్చాడు మేజర్. వారు లోపలికి రాగానే మెరుపులా షీలతో బైటికెళ్ళి తలుపు మూసి గడియ బిగించాడు దుర్యోధన్.

క్షణం వృథా చెయ్యకుండా పోర్టికోలోకి పరిగెత్తి

కారెక్కారిద్దరూ.

"అర్జున్ ఎక్కడ?" అడిగింది షీల పైటతో చెమట తుడుచుకుంటూ.

"రేవు దగ్గర మోటార్ బోట్ తో మనకోసం యెదురు చూస్తూంటాడు. మద్రాసు కెళ్ళడానికిప్పుడు విమానం లేదు. అంగుల్లోనే బైలుదేరాలి" అంటూ కారు స్టార్టు చేసి పరిగెత్తించాడు దుర్యోధన్.

"ఊహించని విధంగా మీరు మళ్ళీ ఎందుకొచ్చారు? ఆ బంగారు కమలి ఎక్కడ? ఈ వజ్రాల హారం కథేమిటి?" అడిగింది షీల అయోమయంగా.

హోటల్లో జరిగిన సంఘటన ఆమెకు వివరించి, "ఈ వజ్రాల హారం సంగతి నాకూ అంతుబట్టడంలేదు. ప్యాలెస్‌లో అంత పటిష్టమైన సెక్యూరిటీ ఏర్పాట్లుండగా యెవరు కాజెయ్యగలరు దాన్ని? గరుడప్పన్ ఊరికే నామీద నిందమోపి, యేదైనా నాటక మాడాలను కున్నాడా?" అంటూ అనుమానం వ్యక్తం చేశాడు దుర్యోధన్.

"ఏది యేమైనా మీ చాకచక్యంవల్ల పెద్ద ప్రమాదం తప్పింది మనకు" అంది షీల తేలిగ్గా నిట్టూరుస్తూ.

రేవు సమీపించగానే కనిపించాడు అర్జున్. "మోటర్ బోటు దొరకలేదు. చేపలుపట్టే పెద్దపెజామర పడవ దొరికింది" అంటూ వారిని లంగరు వేసివున్న మినీ షిప్ దగ్గరికి తీసికెళ్ళాడు.

"ఇదీ ఒకందుకు మంచిదే అయింది" అంటూ షిప్‌ను క్షుణ్ణంగా పరిశీలించాడు దుర్యోధన్.

పైన ఆపరేట్ కేబిన్, దానిచుట్టూ అరుగులాంటి ఖాళీ డెక్, ఓ మూల కింది కేబిన్‌లో కెళ్ళడానికి నాలుగైదు

మెట్లున్నాయి. ఆ మెట్లు దిగి కిందికెళ్ళాడు దుర్యోధన్. వలలూ, చేపలుపట్టే ఇతర సామానూ పెట్టడానికి ఉద్దేశించిన అతి చిన్న కేబిన్ అది. అవసరంవస్తే ఇద్దరు ముగ్గురు పడుకోవచ్చు కూడా!

వెలుతురుకోసం ఓ మూల కొవ్వొత్తులుంచడానికి చిన్న స్టాండు కూడా వుంది. కాళ్ళకు కట్టుకున్న డైనమైట్స్ తీసి, ఆ స్టాండు కమర్చి తిరిగి డెక్ మీది కెళ్లాడు దుర్యోధన్. ఆపరేట్ కేబిన్‌లో ప్రవేశించి, ఇంజన్ స్టార్టు చేసి, దిక్సూచి సాయంతో షిప్‌ను మద్రాసువైపు పరిగెత్తించాడు.

6

చీకటిపడింది మద్రాసు రేవు చేరేసరికి. షిప్‌కు లంగర్ వేసి, టాక్సీలో తిన్నగా హోటల్ కార్వాన్ చేరుకున్నారు ముగ్గురూ.

“షీలా! స్వప్నరాశి నెంబర్ వన్, దివ్యనాథ్‌లు రూం నెంబర్ నూటయేడులో వున్నారో లేదో వెళ్ళి చూసిరా! మా ఇద్దర్ని తప్ప వాళ్ళింకా నిన్ను చూడలేదు” అన్నాడు దుర్యోధన్.

షీల తలూపి హోటల్లోకి నడిచింది.

పార్కింగ్ ప్లేస్‌లో నిల్చుని యెదురుచూడసాగారిద్దరూ.

అరగంటైనా ఆమె తిరిగి రాలేదు. మరో పదిహేను నిమిషాలు ఓపిగ్గా కాచుకున్నారు.

షీల ఐపు లేదు!

“నువ్విక్కడే నిల్చో! గంటలోగా మేము తిరిగి రాకుంటే హెడ్‌క్వార్టర్స్‌కి రింగ్ చేసి ఇన్‌స్పెక్టర్ యుగంధర రెడ్డిని పిలిపించు” అంటూ హోటల్ వైపు

నడిచాడు దుర్యోధన్.

లిఫ్ట్ ద్వారా సెకండ్ ఫ్లోర్ చేరి, నడవా కిరుపక్కలా వున్న రూం నెంబర్స్ చెక్ చేస్తూ 107వ గది ముందాగాడు. తలుపు మూసుంది. మునివేళ్ళతో తోసిచూశాడు. తెరుచుకోలేదు. కోటు జేబులో వున్న అర్జున్ పిస్తోలు సేఫ్టీ కాచ్ లాగి, అవసరంవస్తే వెంటనే తియ్యడానికి అనువుగా పట్టుకుని కాలింగ్ బెల్ నొక్కాడు.

రెండు నిమిషాల తరవాత యెవ్వరో తలుపును సమీపిస్తున్న అడుగుల సవ్వడి. గడియతీస్తున్న అలికిడి. తలుపు తెరుచుకుంది. దివ్యనాథ్.

"మీరా! ఇదేనా రావడం? ప్లీజ్, కమిన్!" అన్నాడు తలుపుకడ్డం తొలుగుతూ.

జేబులో చెయ్యి పెట్టుకునే లోన అడుగు పెట్టాడు దుర్యోధన్.

దివ్యనాథ్ తప్ప ఆ గదిలో యెవ్వరూ లేరు!

"అరగంట క్రితం ఓ యువతి వచ్చిందా ఇక్కడికి?" అడిగాడు అతన్ని పరీక్షగా చూస్తూ.

"ఔను. ఆ పక్క గదిలో స్వప్నరాశితో మాట్లాడుతోంది. యెవ్వరా అమ్మాయి?" అడిగాడు దివ్యనాథ్.

జవాబివ్వకుండా అటు నడిచాడు దుర్యోధన్. ఆ గదిలోని దృశ్యం చూడగానే, దుర్యోధన్ గుండె క్షణం ఆగి తిరిగి కొట్టుకోసాగింది.

ఓ కుర్చీకి చేతులు వెనక్కి విరిచి, తాళ్ళతో కట్టేసి వుంది షీల. అరవడానికి వీల్లేకుండా నోటికడ్డంగా టేప్ అతికించి వుంది!

మెరుపులా పిస్తోలు తీసి, "మిష్టర్ దివ్యనాథ్! యేమిటిది?" అంటూ వెనుదిరగబోయాడు దుర్యోధన్.

అప్పుడు పడింది దెబ్బ. బుర్ర గింగురుమనేలా, కళ్ళు చెదిరి కమ్మేలా పడింది. ఆ దెబ్బనుంచి తేరుకోకముందే మరొకటి పడింది. కళ్ళల్లో చుక్కలు మెరిశాయి. చీకట్లు కమ్ముకున్నాయి.

కుప్పలా కూలిపోయాడు కింద!

7

కళ్ళు తెరిచి చూస్తే నేలమీద బోర్లా పడున్నానని గ్రహించాడు. పరీక్షగా చూశాక తెలిసింది. అది నేల కాదు. మినీ షిప్ మీది చెక్క డెక్! చుట్టూ సముద్రపు హోరు. అంటే, తను సముద్రం మధ్య యేదో షిప్ మీద పడున్నాడన్న మాట!

"సార్!" అన్న కీచు కంఠం విని ఉలిక్కిపడి అటు చూశాడు.

అర్జున్! మసక చీకట్లో తనలాగే కిందపడున్నాడు బోర్లా.

"నిన్నెలా తీసుకొచ్చారిక్కడికి?" అడిగాడు ఆశ్చర్యంగా.

"నన్ను హోటల్ బైట నిల్చోబెట్టి మీరు లోని కెళ్ళిన పావుగంట తరవాత హోటల్ బాయ్ బైటికి వచ్చి, డిటెక్టివ్ దుర్యోధన్ గారు మిమ్మల్ని పిలుస్తున్నారన్నాడు. ఎక్కడున్నారని అడిగితే, సెకండ్ ఫ్లోర్‌లో నూటాయేడవ గదిలోనని చెప్పాడు.

నిజమే అనుకుని లిఫ్ట్ ద్వారా పైకెళ్ళాను. ఆ గది తలుపు తెరిచే వుంది. లోనికెళ్ళిన మరుక్షణం తల వెనక పడింది దెబ్బ. అంతే! కళ్ళు తెరిచి చూస్తే ఇక్కడున్నాను!"

"షీల ఏమైంది?"

"తెలీదు."

"ఈ షిప్ మనం పోర్టుబ్లెయిర్నించి తెచ్చింతేనా?"

అర్జున్ కాసేపు చుట్టూ కళ్లయజూసి, "ఔను. అదే!" అన్నాడు లేచి కూర్చుంటూ.

"హాల్లో డిటెక్టివ్స్!" అన్న కంఠం విని ఇద్దరూ ఉలిక్కిపడి అటు చూశారు.

సదాశివం చేతిలో రివాల్వర్ పట్టుకుని నిల్చుని నవ్వుతున్నాడు.

"నువ్విక్కడికెలా వచ్చావ్?" అన్నాడు దుర్యోధన్ దిగ్భ్రాంతితో లేచి నిల్చుంటూ.

సదాశివం జవాబిచ్చేలోగా ఆపరేట్ కేబిన్లోంచి యెవ్వరో డెక్ మీదికొస్తున్న అడుగుల చప్పుడై అటు చూసి, కొయ్యబారిపోయారు డిటెక్టివ్లు. వేరొకరైతే దిగ్భ్రమతో ఊపిరందక తన్నుకునేవారే!

ఆ వ్యక్తులు యెవ్వరో కాదు. స్వప్నరాశి నెంబర్ వన్, నెంబర్ టూ, ఇద్దరు దివ్యనాథ్లు!! నలుగురు నవ్వుతూ వారిని సమీపించారు. అప్పుడు తొలగిపోసాగాయి దుర్యోధన్ మస్తిష్కాన్ని అంతవరకూ కమ్మివున్న మబ్బుతెరలు!

సాలోచనగా తలూపి, "ఇప్పుడర్థమైంది! మీరంతా ఒకే గ్యాంగ్! అటు గరుడప్పన్నీ, ఇటు నన్నూ ఫూల్స్ని చేసి ఆ బంగారు నెమలిని కాజేశారన్నమాట!"

"అంతేకాదు డిటెక్టివ్! ఆ నెమలితోబాటు పాతికలక్షలు విలువచేసే వజ్రాల హారం కూడా మేమే కాజేశాం! ఈ సంగతి నీవింకా గ్రహించనందుకు చింతిస్తున్నాం!" అన్నాడు సదాశివం నవ్వుతూ.

"ఎలా కాజేశారు?" ఆశ్చర్యంతో దుర్యోధన్ కళ్ళు

విప్పారాయి.

"ఎప్పుడైతే గరుడప్పన్ తన లాకర్ రూంలోంచి ఆ స్వర్ణమయూరాన్ని తెచ్చి నీకివ్వబోయాడో ఆ అదను కోసమే యెదురుచూస్తున్న నేను కల్పించుకుని, షీలకు దాన్ని చూపి తెస్తానని మ్యూజియంలోకి తీసికెళ్ళాను. ముందామెకు దాన్ని చూపి, తిరిగిరమ్మా అదివరకే ఓ చోట రహస్యంగా దాచిపెట్టిన ఆ హారంతీసి, నెమలి కాళ్ళకి దగ్గరగా వున్న గ్లోబ్‌లో దాన్ని దాచి తెచ్చాను. నిజానికాహారం దుర్భేద్యమైన ఆ లాకర్ రూంలోనే వుంటుంది.

ఒకనాడు గరుడప్పన్ కొందరు ప్రత్యేక అతిథులకు అక్కడి అమూల్య వస్తువులు చూపుతుండగా వారి కళ్ళు గప్పి, లాఘవంగా ఆ హారాన్ని కోటుజేబులోకి చేర్చి వారివెంట బైటికి వచ్చేశాను. దాన్ని లాకర్ రూం లోంచి ఇవతలికైతే తేగలిగాను గానీ అక్కడి అభేద్యమైన సెక్యూరిటీ సిబ్బంది కళ్ళు గప్పి బైటికి తీసికెళ్ళే ధైర్యం చాల్లేదు నాకు.

అందుకే, నిన్ను ఎరగా ఎన్నుకుని, నెమలితోబాటు హారాన్ని కూడా బైటికి చేర్చడంలో విజయం సాధించాం! ఆ తరవాత స్వప్నరాణీ, దివ్యనాథ్‌లు హోటల్ గదిలో నిన్ను బోల్తాకొట్టించి, చీకట్లో అసలు నెమలి కాజేసి, నకిలీ నెమలి వుంచిపోయారు. బాల్కనీగుండా పిస్తోలు పేల్చిందికూడా నేనే!

కేవలం ఆ హారంకోసమే ఇంత నాటకమూ, రిస్కూ తీసుకున్నాననుకున్నావా? నో, నో! అసలు కథ వేరే వుంది. ఆ కథకు సూత్రధారి యెవ్వరోకాదు. అదుగో, ఆ దివ్యనాథ్ నెంబర్ టూ!" అంటూ కళ్ళద్దాలూ, పిల్లి

గడ్డమూ వున్న వ్యక్తివైపు చూపాడు సదాశివం.

“అతని అసలు పేరు దివ్యనాథ్ కాదు. భాను ప్రకాశ్! పురాతత్వశాస్త్రవేత్త!! విజయనగరానికి ఇరవై మైళ్ళ దూరంలోని చిత్రదుర్గం అనే ఊరి పరిసరాల్లో పురాతత్వశాఖ ఆధ్వర్యంలో చారిత్రక అవశేషాలకోసం త్రవ్వకాలు జరుపుతున్నప్పుడు అతనికో తామ్రపత్రం దొరికింది.

దేవనాగర లిపిలో రాసివున్న ఆ పత్రాన్ని చదవగానే అత్యంత ఆశ్చర్యకరమైన ఒక నిగూఢ రహస్యం తెలిసిందతనికి. చిత్రదుర్గమనే ఆ ఊరు ఒకప్పుడు రణభేరుల త్రివిక్రమ నాయుడనే సేనాపతి జాగీరుగా వుండేదనీ, మరణించేముందు ఆయన తన అమూల్య సంపదనంతా ఒక ఉక్కు పెట్టెలో భద్రపర్చి, ఓ రహస్య ప్రదేశంలో పాతిపెట్టాడనీ.

ఆ ప్రదేశం తాలూకు వివరాలు వారి వంశ చిహ్నమైన బంగారు నెమలి కడుపులో నిక్షిప్తపర్చిన రాగి రేకుపై పొందుపర్చి వున్నాయని తెలిసింది! ఆ రహస్యాన్ని ప్రభుత్వానికి బహిర్గతం చేస్తే తనకు లభించేది ఓ ప్రశంసా పత్రం, కొద్దిపాటి బహుమానం తప్ప మరేమీ కావని, యెలాగైనా ఆ నిక్షిప్త నిధిని తానే కైంకర్యం చేసుకోవాలని ఆలోచించాడు భానుప్రకాశ్.

వెంటనే ఆ వంశస్థులకోసం ఆరాతీస్తూ, చివరికి విజయనగరంలో స్థిరపడ్డ రణభేరుల రఘుపతినాయుడి నివాసాన్ని కనుగొన్నాడు. ఐతే, ఆయన పెద్దకొడుకు ఆ బంగారు నెమలిని గరుడప్పన్‌కి అమ్మేశాడని తెలియగానే, తిన్నగా పోర్టుబ్లేయర్ చేరుకున్నాడు.

అదృష్టవశాత్తూ ఆ సమయంలో గరుడప్పన్ పనిమీద

త్రివేండ్రం వెళ్ళటంవల్ల, విధిలేక అతని యొస్టేట్ మేనేజరైన నన్ను కలుసుకుని ఆ బంగారు నెమలి విషయం కదిపాడు. తను కొన్న వస్తువులు గరుడప్పన్ ఎట్టి పరిస్థితిలోనూ, ఎవరికీ అమ్మడని తెలిసి ఎలాగైనా దాన్ని సంపాదించాలనే ఉద్దేశంతో అసలు రహస్యం నాకు చెప్పి, ఆ నిధిలో నన్నూ భాగస్వామిగా చేర్చుకున్నాడు భానుప్రకాశ్.

గరుడప్పన్ లాకర్ రూంలో భద్రపర్చిన ఆ నెమలిని సంపాదించడం అంత సులభంకాదు గనక, బాగా ఆలోచించి ఓ పథకం రూపొందించాను. దివ్యనాథ్ నెంబర్ వన్ గా మీకు పరిచయమైన నా తమ్ముణ్ణి, అతని భార్యనూ మీ వద్దకు పంపి, బంగారు నెమలి ప్రస్తావన ఎత్తించాను.

అందుకు మీరు నిరాకరించడంతో, భానుప్రకాశ్ నూ, అతని భార్యనూ అవే పేర్లతో, అదే కథనంతో మళ్ళీ మీ దగ్గరకు పంపాను. అప్పుడు రేకెత్తింది నీలో ఆసక్తి. పోర్టుబ్లేయర్ వెళ్ళడానికి ఒప్పుకున్నావు.

దాంతో అటు గరుడప్పన్ కు — స్వప్నరాశి అనే అమ్మాయి ఆ బంగారు నెమలికోసం తీవ్రంగా ప్రయత్నిస్తోందనీ, ఆమె తరఫున దాన్ని సంపాదించడానికి మద్రాసునించి డిటెక్టివ్ దుర్యోధన్, లేడీ ఇన్వెస్టిగేటర్ షీలా వచ్చారనీ చెప్పి, అతనిలోనూ జిజ్ఞాస మొలకెత్తించాను.

ఎట్టకేలకు మా ప్రయత్నంలో విజయం సాధించాం! ఇక ఆ నిధిని వెదికి స్వంతం చేసుకోడమే తరవాయి. దురదృష్టవశాత్తూ అది మాకు దక్కకున్నా, పాతికలక్షల హారం వుండనే వుంది. దానితోనే సరిపుచ్చుకోవచ్చు.

యెలా వుంది ప్లాను?" అడిగాడు సదాశివం విలాసంగా పిస్తోలు ఊపుతూ.

"బ్రహ్మాండంగా వుంది. మీ లక్ష్యాన్ని సాధించారు. ఇంకేం, ఇప్పుడు మమ్మల్నెక్కడికి తీసికెళుతున్నారు?" అడిగాడు దుర్యోధన్ ఆశ్చర్యంలోంచి తేరుకుని.

అతను నవ్వి—"మా రహస్యాలు తెలిసిన నీవు ప్రాణాలతో వుండటం ఎంత ప్రమాదమో మాకన్నా నీకే బాగా తెలుసు. అందుకే మిమ్మల్ని ఇలా సముద్రం మధ్యకు తెచ్చాను. ఈ షిప్‌తో సహా మీరు సముద్రంలో మునిగి చేపలకీ, సముద్ర జంతువులకీ మనిషి మాంసం రుచి చూపిస్తారు" అన్నాడు.

దుర్యోధన్ బుర్ర చురుగ్గా పనిచెయ్యసాగింది. "షీల ఎక్కడుంది?" అడిగాడు.

"భయపడక! కింద కేబిన్‌లో బంధించాము. మీరు ముగ్గురూ మరణించాక కూడా కలిసి కట్టుగా యమపురికి ప్రయాణమౌతారు" అన్నాడు సదాశివం నవ్వుతూ.

"షిప్‌తోబాటు మమ్మల్ని ముంచి మీరెక్కడికి పోగలరు? మాతోబాటు మీరూ సముద్రం లోతు చూడరా?" అడిగాడు దుర్యోధన్.

పకపక నవ్వాడు సదాశివం. "ఆ మాత్రం ఏర్పాట్లు చేసుకోలేమనుకున్నావా మైడియర్ ఫూల్ డిటెక్టివ్! అదుగో, ఆ మోటార్‌బోట్ మాకోసం సిద్ధంగా వుంది. అందులో సురక్షితంగా వెళ్ళిపోతాను" అంటూ సముద్రంలోకి చూపాడు సదాశివం.

ఫర్లాంగు దూరాన ఏదో వస్తున్నట్టు చీకట్లో మిణుకు మిణుకు మంటోంది లైటు.

"ఈ షిప్ నాలుగు మూలలా టైంబాంబులు పెట్టాం!

సరిగ్గా పదిగంటల ఇరవై నిమిషాలకు అవి పేలుతాయి. షిప్‌తో బాటు మీ ముక్కలూ గాలిలో ఎగురుతాయి" అన్నాడు సదాశివం.

టైం చూశాడు దుర్యోధన్. తొమ్మిదిన్నర!

కాసేపు తీవ్రంగా ఆలోచించి పెదవి విరుస్తూ తలెత్తాడు. "మిస్టర్ సదాశివం! నీవు చెప్పినట్టు నిజంగా ఇవి మా చివరి ఘడియలే అనిపిస్తోంది. తప్పించుకునే మార్గాలేవీ ఇక లేనట్టున్నాయి. చుట్టూ విశాలమైన సముద్రం! మేము నిరాయుధులం!!"

"నా సవాన్ని గ్రహించినందుకు సంతోషం!"

"ఈ చివరి క్షణాల్లో నా చివరికోరిక ఒకటి తీరుస్తారా?"

సదాశివం కనుబొమలు ముడిపడ్డాయి. "ఏమిటి?"

"పెళ్ళై పచ్చగా సంసారం చేసుకోవలసిన వయసులో నా కారణంగా ఈ రొంపిలో దిగి ప్రాణానికి ముప్పు తెచ్చుకుంది షీల. ఈ చివరి ఘడియల్లో ఆమెకు క్షమాపణలు చెప్పుకుని వీడ్కోలు తీసుకోవాలనుకుంటున్నాను. ఆమె నన్ను క్షమించానని చెప్పందే నా ఆత్మకు శాంతి లభించదు.

"ప్లీజ్! పదినిమిషాలు. పది నిమిషాలు నాకు ప్రసాదించండి. ఉరితియ్యాపోయే ఖైదీని సైతం అతని చివరి కోరిక తీర్చడానికి ప్రయత్నిస్తారు. అలాగే, మీరూ నా కోరిక నిరాకరించరని నమ్ముతున్నాను" అన్నాడు దుర్యోధన్ వేడుకోలుగా.

వెంటనే పలకలేదు సదాశివం! కాసేపు ఆలోచించి, యేమనుకున్నాడో యేమో, "ఆల్‌రైట్! కిందికెళ్ళి ఆమెను కలుసుకో. పదినిముషాలకిమించి అరక్షణం కూడా

నేను అనుమతించేది లేదు" అన్నాడు.

"థాంక్యూ! థాంక్యూ వెరీమచ్!" అంటూ మెట్ల వైపు నడిచాడు దుర్యోధన్.

కింది కేబిన్‌లో అడుగుపెట్టి చూస్తే కుర్చీకి కట్టేసి వుంది షీల. గబగబ ఆమె కట్లు విప్పి, కొవ్వొత్తులుంచే రాక్‌ని సమీపించాడు. ఆరు డైనమైట్స్ ఇంకా అలాగే వున్నాయి. దూరంనించి అవి నిజంగా కొవ్వొత్తుల్లాగే కనిపిస్తాయి గనక, వాటి గురించి యెవ్వరూ పట్టించుకోలేదు. జేబులు తడుముకున్నాడు. వేళ్ళకు తగిలింది లైటర్!

డైనమైట్స్ కోటుజేబులో వేసుకుని, "ఇంకా మన నెత్తిమీదే వుంది ప్రమాదం! ఇది చివరి ప్రయత్నం! వెనించి నేను కేకెయ్యగానే నువ్వు పరిగెత్తుకు రావాలి" అంటూ చేతులు కోటుజేబుల్లో పెట్టుకుని, నింపాదిగా మెట్లెక్కి డెక్ మీదికెళ్ళాడు.

"మిస్టర్ సదాశివం! షీలని కలుసుకున్నాక నా నిర్ణయం మార్చుకున్నాను."

"ఏ నిర్ణయం?"

"ఇలా మీ చేతుల్లో దిక్కులేని చావు చావకూడదని."

విరగబడి నవ్వాడు సదాశివం. "జోక్ చేస్తున్నావా? లేక పిచ్చిగానీ పట్టిందా?"

"జోక్ చెయ్యడంలేదు. పిచ్చి పట్టలేదు. నిజమే!" అంటూ జేబులోంచి డైనమైట్, లైటర్ తీసి, వెంటనే లైటర్ వెలిగించాడు దుర్యోధన్.

దిగ్భ్రాంతితో అందరి నోళ్ళూ తెరుచుకున్నాయి. సదాశివం మెరుపులా పిస్తోలు గురిపెట్టాడు.

"అనవసరంగా పిచ్చివేషాలు వెయ్యక! నువ్వు గురి

తప్పకుండా పిస్తోలు కాల్చవచ్చు. నేను చావడానికి క్షణం పట్టవచ్చు. ఆ ఒక్క క్షణం చాలు నాకు. ఈ డైనమైట్ వత్తి వెలిగించడానికి, నాతోబాటు మీరందరూ ముక్కలు చెక్కలై పోతారన్న విషయం మరవక! అనుమానం వుంటే చూడు!" అంటూ లైటర్‌తో డైనమైట్ వత్తి వెలిగించి సముద్రంలోకి విసిరాడు దుర్యోధన్.

అంతే! దిక్కులు పిక్కటిల్లే చప్పుడు. నీటిలో ఉవ్వెత్తు అలలు!! షిప్ యెండుటాకులా అటూ ఇటూ వూగ సాగింది. వాళ్ళా షాక్‌లోంచి తేరుకోకముందే ఇంకో డైనమైట్ తీసి రెడీగా పట్టుకున్నాడు దుర్యోధన్.

"చూశారా? ఈ సముద్రంలో ఒంటరిగా, నికృష్టమైన చావు చచ్చేబదులు నాతోబాటు అందర్నీ తీసుకుని యేనికి చావకూడదు? ప్రాణాలమీద తీపివుంటే నా దగ్గర ఓ షరతుంది. ఆ షరతుకు ఒప్పుకుంటే అందరి ప్రాణాలూ సురక్షితమౌతాయి."

"ఏమిటది?" అడిగాడు సదాశివం చమట్లు కక్కుతూ.

"ఆ పిస్తోలు కిందపడేసి, నీ మనుషులతో తిన్నగా ఆ మోటార్ బోట్లోకి వెళ్ళిపో. మేం ముగ్గురం ఈ షిప్‌లో మద్రాసు వెళ్ళిపోతాం! మీరు మీ ఇష్టం వచ్చిన చోటికి పారిపొండి. ఇందులో యెవ్వరికీ యెలాటి నష్టమూ వుండదు. యేమంటావ్?"

విధిలేక పళ్ళు పటపట కొరుకుతూ పిస్తోలు ఓ మూలకి విసిరాడు సదాశివం!

మెరుపులా వెళ్ళి దాన్నందుకుని వారివైపు గురి పెట్టాడు అర్జున్!!

"ఇదేమిటి?" అన్నాడు సదాశివం ఆశ్చర్యంగా.

"సారీ, అయామ్ వెరీ సారీ! చేజిక్కిన నేరస్థుల్ని వదిలిపెట్టడం నా నియమావళికి విరుద్ధం! ఇప్పుడు మీరంతా నా బందీలు. షీలా! ఆ తాళ్ళు తీసుకుని పైకిరా! హరి యప్!" అన్నాడు దుర్యోధన్ గట్టిగా.

"మోసం! ద్రోహం!!" అరిచాడు సదాశివం.

"ఈ జీవితాలే అంత! నేరస్థులు రకరకాల ఎత్తులు వేసి నేరం చేస్తారు. మేము ఆ ఎత్తులకి పై ఎత్తులు వేసి వారిని చిత్తు చేస్తాం! ఐతే, ఒక విషయంలో మాత్రం నేనే కాదు, దేశం యావత్తూ మీకు కృతజ్ఞతలు తెల్పుకోవాలి. మీ కారణంగా ఎక్కడో భూమిలో పాతుకు పోయిన ఆ అమూల్య నిధి ఆచూకీ తెలిసి, ప్రభుత్వ ఖజానా కడుపు నిండబోతోంది!"

అంతలో షీల తాళ్ళతో వచ్చేసిందక్కడికి. అర్జున్ పిస్తోలు దుర్యోధన్‌కిచ్చి, ఆ తాళ్ళతో అందరి కాళ్ళూ, చేతులూ విరిచికట్టి కిందపడేశాడు.

"అర్జున్! వీళ్ళని పిస్తోలుతో కవర్ చేస్తూ ఇక్కడే వుండు. షీలా! నువ్వు డెక్ నాలుగు మూలలు వెదికి టైం బాంబ్స్ తీసి సముద్రంలో విసిరేయ్. నేను షిప్‌ని మద్రాసువైపు మళ్ళిస్తాను" అంటూ ఇంజన్ కేబిన్ వైపు నడిచాడు దుర్యోధన్.

—: అయిపోయింది :—